

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 16-07-2026 | సంపుటి - 29 | సంచిక - 54 | రూ : 4 | పేజీలు: 8


# రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టండి




- అమెజాన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

**హైదరాబాద్, 15 జూలై :**
'ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దనున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 విధానానికి అనుగుణంగా ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులు త్వరలో రానున్నాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'వచ్చే ఎనిమిదేళ్లలోనే రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టండి.. మీకు అవసరమైన అనుమతులను మేం ఇస్తాం' అని అమెజాన్ సంస్థను కోరారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ సంస్థ నిర్మిస్తున్న అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి పథంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని, గ్లోబల్ సమిట్ ద్వారా తమ లక్ష్యాలను చాటిచెప్పామని తెలిపారు. ''ఫ్యూచర్ సిటీ సహా ఔటర్ రింగ్ రోడ్, విమానాశ్రయం, రేడియల్ రింగ్‌రోడ్‌ల నిర్మాణాలకు విలువైన భూములు ఇచ్చిన రంగారెడ్డి జిల్లా రైతులను అభినందిస్తున్నాం. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందిస్తాం. పరిశ్రమల్లో వారి పిల్లలకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నాం.

**పరిశ్రమలు.. సాఫ్ట్‌వేర్ సంస్థలు..**

రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, సాఫ్ట్‌వేర్, ఇతర పరిశ్రమల స్థాపనకు ఒక కార్యాచరణ రూపొందించింది. 2034 సంవత్సరానికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ.. 2047 సంవత్సరానికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఈ లక్ష్యాలను గడువులోపే సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది. అందుకే ఇన్వెస్ట్‌మెంట్ పాలసీపై దృష్టి పెట్టాం. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీపై దృష్టి సారించాం. పారిశ్రామిక, పర్యాటక, ఇంధన, క్రీడలు, సంక్షేమ రంగాలకు సమగ్ర విధానాలను రూపొందించాం. నాణ్యమైన విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పిస్తున్నాం. అభివృద్ధిలో చైనాతో పోటీపడుతున్నాం.

**3 వేల ఆర్టీసీ డీజిల్ బస్సులు జిల్లాలకు..**

గ్రేటర్ హైదరాబాద్‌లోని 1.34 కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు లేకుండా జీవించేలా పరిశ్రమలను ఔటర్ వెలుపలకు తరలిస్తున్నాం. మూడువేల ఆర్టీసీ డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించి హైదరాబాద్‌లో ఈవీ బస్సులు నడపనున్నాం. రెండు లక్షల ఆటోలను రెట్రో ఫిటింగ్ చేస్తున్నాం. విద్యుత్తు వాహనాలు కొంటున్న వారిపై ఎలాంటి పన్ను తరువాయి 2లో

# సర్ డిక్లరేషన్ లో చేర్పులు వద్దు

- ఈసీకి జాన్ బ్రిట్టాస్ లేఖ
- ఆన్‌లైన్ దరఖాస్తుదారులకు అదనపు షరతులు సరికాదు
- సమానత్వ హక్కుకు విరుద్ధం పాత వివరాలు అందించడం ఆచరణ సాధ్యం కాదు



న్యూఢిల్లీ : కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం 6 ఆన్‌లైన్ దరఖాస్తులో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన కొత్త డిక్లరేషన్‌ను చేర్చిన ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయంపై సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పు చట్టబద్ధ అధికార పరిధిని దాటి చేసిన చర్యగా (అల్ట్రా వైర్స్) కనిపిస్తోందని పేర్కొన్నారు. వెంటనే ఆ నిబంధనను ఉపసంహరించుకోవాలని వివరించారు. ఈ మేరకు జాన్ బ్రిట్టాస్.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఫారం 6లో కొత్త

తరువాయి 2లో

## భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

- 2026-27కు కొత్తగా 810 రాక
- సర్కారు వైద్య కళాశాలల్లో 110, ప్రైవేట్, డీమ్డ్ కళాశాలల్లో. 700
- మొత్తంగా రాష్ట్రంలో అందుబాటులోకి 9,650 సీట్లు



2లో



## విశ్వంలో చక్కెరను గుర్తించిన శాస్త్రవేత్తలు

- పాలపుంత మధ్యలోని వాయు మేఘంలో ఉన్నట్లు గుర్తింపు
- జీవం ఆవిర్భావానికి ఇవి దోహదపడొచ్చని అంచనా
- పరిశోధన వివరాలు నేచర్ ఆస్ట్రానమీలో ప్రచురితం
- భూమికి కోట్ల టన్నుల చక్కెర చేరి ఉండొచ్చని అంచనా

2లో




## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం

ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో 1 డాలర్ నాణెం విడుదల

షేక్ హసీనాకు సవాల్

## చట్టం ముందు నిలవాల్సిందే!

- ఈ ఏడాది చివరి నాటికి బంగ్లాదేశ్ వెళతానంటున్న షేక్ హసీనా
- హసీనాకు స్వాగతమన్న ప్రధాని రెహమాన్ సలహాదారు జాహెద్
- అయితే తనపై ఉన్న కేసులను హసీనా ఎదుర్కోవాలని వ్యాఖ్య



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మళ్లీ స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలపై అక్కడి ప్రస్తుత ప్రభుత్వం అత్యంత దూకుడుగా స్పందించింది. ఆమె ఢాకాకు రావాలనుకోవడాన్ని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని పేర్కొంటూనే.. దేశద్రోహం, మానవ హక్కుల ఉల్లంఘన కేసుల్లో మరణశిక్ష పడిన తరువాయి 2లో

కృష్ణాగోదావరి సంగమం

## జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు



- పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి
- రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరందిస్తామని స్పష్టీకరణ
- పట్టిసీమ ప్రాజెక్టుపై గత విమర్శలను ప్రసంగంలో తిప్పికొట్టిన చంద్రబాబు
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

2లో

భారత్‌యూకే ట్రేడ్ డీల్..

## ఏవి చౌక.. ఏ రంగాలకు లాభం?

**ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చిన భారత్-యూకే సమగ్ర వాణిజ్య ఒప్పందం**

- భారత ఎగుమతులపై దాదాపు 99 శాతం వరకు సుంకాల రద్దు
- స్కాచ్ విస్కీ, లగ్జరీ కార్లు, కాస్మొటిక్స్ వంటివి భారత్‌లో చౌకయ్యే అవకాశం
- టెక్స్‌టైల్స్, లెదర్, ఫార్మా రంగాలకు భారీగా ప్రయోజనం చేకూరనున్న వైనం
- 2030 నాటికి ఇరుదేశాల వాణిజ్యం 120 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం



2లో

హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయం..

## యూఏఈ వ్యూహాత్మక అడుగు



- ఫుజైరాలో కొత్త పోర్టు, కంటైనర్ టెర్మినల్ నిర్మాణం
- ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా షిప్పింగ్‌కు ప్రత్యామ్నాయ మార్గం
- తూర్పు తీరంలో లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న యూఏఈ

# రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టండి

హైదరాబాద్: 'ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దనున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 విధానానికి అనుగుణంగా ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులు త్వరలో రానున్నాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'వచ్చే ఎనిమిదేళ్లలోనే రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టండి.. మీకు అవసరమైన అనుమతులను మేం ఇస్తాం' అని అమెజాన్ సంస్థను కోరారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ సంస్థ నిర్మిస్తున్న అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి పథంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని, గ్లోబల్ సమిట్ ద్వారా తమ లక్ష్యాలను చాటిచెప్పామని తెలిపారు. "ఫ్యూచర్ సిటీ సహా ఔటర్ రింగ్ రోడ్, విమానాశ్రయం, రేడియల్ రింగ్‌రోడ్‌ల నిర్మాణాలకు విలువైన భూములు ఇచ్చిన రంగారెడ్డి జిల్లా రైతులను అభినందిస్తున్నాం. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందిస్తాం. పరిశ్రమల్లో వారి పిల్లలకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నాం.

**పరిశ్రమలు.. సాఫ్ట్‌వేర్ సంస్థలు..**

రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, సాఫ్ట్‌వేర్, ఇతర పరిశ్రమల స్థాపనకు ఒక కార్యాచరణ రూపొందించింది. 2034 సంవత్సరానికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ.. 2047 సంవత్సరానికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఈ లక్ష్యాలను గడువులోపే సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది. అందుకే ఇన్వెస్ట్‌మెంట్ పాలసీపై దృష్టి పెట్టాం. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీపై దృష్టి సారించాం. పారిశ్రామిక, పర్యాటక, ఇంధన, క్రీడలు, సంక్షేమ రంగాలకు సమగ్ర విధానాలను రూపొందించాం. నాణ్యమైన విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పిస్తున్నాం. అభివృద్ధిలో చైనాతో పోటీపడుతున్నాం.

**3 వేల ఆర్టీసీ డీజిల్ బస్సులు జిల్లాలకు..**

గ్రేటర్ హైదరాబాద్‌లోని 1.34 కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు లేకుండా జీవించేలా పరిశ్రమలను ఔటర్ వెలుపలకు తరలిస్తున్నాం. మూడువేల ఆర్టీసీ డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించి హైదరాబాద్‌లో ఈవీ బస్సులు నడపనున్నాం. రెండు లక్షల ఆటోలను రెట్రో ఫిటింగ్ చేస్తున్నాం. విద్యుత్తు వాహనాలు కొంటున్న వారిపై ఎలాంటి పన్ను వసూలు చేయడం లేదు. ఢిల్లీలో కాలుష్యం, ముంబయిలో వరదలు, బెంగళూరులో ట్రాఫిక్ ఇబ్బందులు మన హైదరాబాద్ ప్రజలకు వద్దని ఇదంతా చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

**నిరంతర విద్యుత్తు: మంత్రి శ్రీధర్‌బాబు**

డేటా సెంటర్లకు అవసరమైన నిరంతర విద్యుత్తు, అవసరమైనంత నీరు, మౌలిక సదుపాయాలను కల్పించనున్నామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. "అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా కేంద్రానికి మరిన్ని సదుపాయాలను సమకూర్చనున్నాం. అమెజాన్ వంటి సంస్థల పెట్టుబడులతో 2034 కల్లా ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సులభంగా సాధిస్తాం. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులు విక్రమ్, అనురాగ్‌లు మమ్మల్ని నేరుగా సంప్రదించగానే... వేగంగా అనుమతులు ఇచ్చాం. ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాలు కేటాయించాం. నాలుగేళ్లలోపు పనులు పూర్తి చేస్తారు. చేవెళ్ల మండలంలోని ఆలూరులో ప్రత్యేకంగా డేటా సెంటర్ పార్కును ప్రారంభించనున్నాం. తెలంగాణలోని పారిశ్రామిక విధానాన్ని తెలుసుకుని దేశవ్యాప్తంగా పలు బహుళజాతి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయి' అని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనర్ కె.శశాంక, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్: తెలంగాణలో వైద్య విద్యలో చేరాలనుకునే విద్యార్థులకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) తీపి కబురు అందించింది. రాష్ట్రంలో భారీగా ఎంబీబీఎస్ సీట్లను పెంచుతూ నిర్ణయం తీసుకొంది. 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన తాజా సీట్ మ్యాట్రిక్స్ ప్రకారం.. తెలంగాణలో ఏకంగా 810 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. వీటిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 110, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో 600, డీమ్డ్ వైద్య విశ్వవిద్యాలయ కళాశాలల్లో 100 సీట్ల చొప్పున అదనంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు ఎన్ఎంసీ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సీట్లు కూడా ఈ ఏడాది నీట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ కానున్నాయి. 202526 వైద్య సంవత్సరానికి రాష్ట్రంలో 8,840 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉండగా.. పెరిగిన ఈ సీట్లతో రాష్ట్రంలో మొత్తం వైద్య సీట్ల సంఖ్య 9,650కి పెరిగింది.

## భారత్‌యూకే ట్రేడ్ డీల్: ఏవి చౌక.. ఏ రంగాలకు లాభం?

భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఒప్పందంతో ప్రపంచంలోని అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటైన యూకేలో భారత ఎగుమతిదారులకు అపారమైన అవకాశాలు లభించనున్నాయి. అదే సమయంలో పలు ప్రీమియం బ్రిటిష్ ఉత్పత్తులు భారత కొనుగోలుదారులకు తక్కువ ధరలకే అందుబాటులోకి రానున్నాయి. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగ కల్పనను ప్రోత్సహించి, భారత తయారీ, సేవా రంగాలకు కొత్త ఊపునిస్తుందని వాణిజ్య నిపుణులు విశ్లేషిస్తున్నారు.

*** భారత ఎగుమతిదారులకే అతిపెద్ద ప్రయోజనం**

ఈ ఒప్పందంలో సింహభాగం ప్రయోజనం భారత ఎగుమతిదారులకే దక్కనుంది. యూకేకు భారత్ చేసే ఎగుమతుల్లో దాదాపు 99 శాతం వస్తువులపై ఇకపై సుంకాలు ఉండవు. అంటే.. ఇప్పటివరకు బ్రిటన్‌లో దిగుమతి సుంకాలతో సతమతమైన వేలాది భారత ఉత్పత్తులు ఇకపై సుంకాలు లేని ప్రవేశంతో యూరోప్, చైనా వంటి దేశాల ఉత్పత్తులకు గట్టి పోటీ ఇవ్వనున్నాయి. ముఖ్యంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కార్మికఆధారిత రంగాలకు ఈ ఒప్పందం ఒక వరంలా మారనుంది. వస్త్రాలు, దుస్తులు, తోలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులు, ఆటో విడిభాగాలు, ప్రాసెస్డ్ ఫుడ్, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయ ఉత్పత్తుల రంగాలకు భారీ ప్రోత్సాహం లభిస్తుంది. సుంకాల తొలగింపుతో లాభాల మార్జిన్లు పెరిగి, ఉత్పత్తి పెరిగి, తయారీ కేంద్రాల్లో కొత్త ఉద్యోగాలు వస్తాయని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ ఒప్పందంపై వయనా ప్రెసిడెంట్ కౌశల్ సంపత్ ఎన్డీటీవీతో మాట్లాడుతూ.. "భారత్ యూకే ఒప్పందం భారత ప్రపంచ వాణిజ్య ప్రయాణంలో ఒక కీలక మైలురాయి. ఇప్పటికే యూకే భారత ఐదో అతిపెద్ద ఎగుమతి గమ్యస్థానంగా ఉన్నప్పటికీ, మన దిగుమతుల్లో దాని వాటా కేవలం 1 శాతమే. ఇది సమతుల్య వాణిజ్యానికి ఇంకా చాలా అవకాశాలు ఉన్నాయని సూచిస్తోంది. ఈ ఒప్పందం ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు కొత్త అవకాశాలను అందిస్తుంది" అని వివరించారు.

**సేవా రంగానికి నూతన ఉత్తేజం**

ఈ ఒప్పందం కేవలం వస్తువులకే పరిమితం కాలేదు. భారత ఐటీ కంపెనీలు, కన్సల్టింగ్ సంస్థలు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, అకౌంటెంట్లు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విద్యా సేవా ప్రదాతలకు యూకే మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం కానుంది. ఈ ఒప్పందంలో 137 సేవా ఉపరంగాలు ఉన్నాయి. అంతేకాకుండా, 'డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ (DCC)' అనే నిబంధన భారత నిపుణులకు ఎంతో మేలు చేయనుంది. దీని ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేసే భారత ఉద్యోగులు ఐదేళ్ల వరకు రెండు దేశాల్లోనూ సామాజిక భద్రతా చందాలు చెల్లించాల్సిన అవసరం లేదు.

*** భారత్‌లో చౌకగా లభించనున్న వస్తువులు ఇవే**

వినియోగదారులకు ధరల తగ్గింపు వెంటనే కనిపించకపోయినా, దశలవారీగా సుంకాలు తగ్గడం వల్ల పలు బ్రిటిష్ ఉత్పత్తులు చౌకగా మారనున్నాయి. వాటిలో ముఖ్యమైనవి:

1. స్కాచ్ విస్కీ, . జిన్ ప్రీమియం బ్రిటిష్ కార్లు
3. లగ్జరీ మోటార్‌సైకిళ్లు ,
4. కాస్మొటిక్స్ చాక్లెట్లు, బిస్కెట్లు
5. వైద్య పరికరాలు, 6. కొన్ని ఆహార ఉత్పత్తులు

ముఖ్యంగా లగ్జరీ కార్లపై ప్రస్తుతం 110 శాతం వరకు ఉన్న దిగుమతి సుంకాలు, రాబోయే సంవత్సరాల్లో కోటా విధానం కింద గణనీయంగా తగ్గుతాయి. అయితే, ఈ తగ్గింపులు దశలవారీగా ఉంటాయని గమనించాలి.

**దిగుమతుల ఆవల అసలు ప్రాధాన్యత**

చౌకగా లభించే లగ్జరీ వస్తువులు వార్తల్లో నిలిచినప్పటికీ, ఈ ఒప్పందం యొక్క నిజమైన ప్రాముఖ్యత ఎగుమతులలోనే ఉందని ఆర్థికవేత్తలు నమ్ముతున్నారు. ప్రపంచంలోని ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన యూకే మార్కెట్‌లోకి సులభమైన ప్రవేశం, ప్రపంచ వాణిజ్యంలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి నెలకొన్న తరుణంలో భారత తయారీదారులకు తమ ఎగుమతులను విస్తరించుకోవడానికి గొప్ప అవకాశం కల్పిస్తుంది. ఈ ఒప్పందం ద్వారా తయారీ, ఆర్థిక సేవలు, పునరుత్పాదక ఇంధనం, విద్య, టెక్నాలజీ రంగాలలో బ్రిటిష్ పెట్టుబడులు భారత్‌కు మరింతగా వస్తాయని అంచనా. అసోచామ్ అంచనా ప్రకారం ఈ ఒప్పందంతో 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు రెట్టింపు అయి 120 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఒప్పందాన్ని ఒక "చారిత్రక మైలురాయి"గా అభివర్ణించారు. ఇది రైతులు, కార్మికులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు అవకాశాలు సృష్టించి, 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనకు దోహదపడుతుందని ఆయన అన్నారు. అంతిమంగా ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థను అధునాతన ప్రపంచ మార్కెట్లతో మరింత లోతుగా అనుసంధానించడంలో ఒక వ్యూహాత్మక ముందడుగుగా నిలుస్తుంది.

## హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయం..
# యూఏఈ వ్యూహాత్మక అడుగు

పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో, వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేయడంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, దుబాయ్‌కి చెందిన ప్రముఖ పోర్ట్స్ ఆపరేటర్ 'డీపీ వరల్డ్', దేశ తూర్పు తీరంలోని ఫుజైరాలో కొత్త మల్టీపర్పస్ పోర్టు, కంటైనర్ టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే, నౌకలు ప్రమాదకరమైన హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించాల్సిన అవసరం లేకుండానే నేరుగా యూఏఈకి సరుకు రవాణా చేసే వెసులుబాటు కలుగుతుంది. ఇరాన్, ఒమన్ దేశాల మధ్య ఉన్న ఇరుకైన హర్మూజ్ జలసంధి ద్వారా ప్రపంచ చమురు అవసరాల్లో ఐదో వంతు రవాణా జరుగుతుంది. అయితే, గత కొన్ని నెలలుగా అమెరికాఇరాన్ మధ్య నెలకొన్న ఘర్షణలు, వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడుల కారణంగా ఈ మార్గంలో సరుకు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీని ప్రభావంతో, ప్రాంతీయ వాణిజ్యానికి కేంద్ర బిందువైన దుబాయ్‌లోని జెబెల్ అలీ పోర్టులో నౌకల రాకపోకలు కొన్ని సందర్భాల్లో 90 నుంచి 95 శాతం వరకు తగ్గినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంక్షోభ పరిస్థితులను అధిగమించేందుకు యూఏఈ పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఫుజైరాలోని ఈ నూతన పోర్టు నేరుగా గల్ఫ్ ఆఫ్ ఒమన్‌తో అనుసంధానమై ఉంటుంది. ఇక్కడికి చేరిన సరుకును సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుబాయ్, అబుదాబి వంటి ప్రధాన నగరాలకు రోడ్డు మార్గం ద్వారా సులభంగా తరలించవచ్చు. ఈ భారీ ప్రాజెక్టు కోసం వందల మిలియన్ డాలర్ల పెట్టుబడి అవసరమని, సుమారు 18 నెలల్లో ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంపొందించుకునే ఈ ప్రణాళికలో భాగంగా, షార్జాకు చెందిన 'గల్ఫ్‌టైనర్' సంస్థ సైతం సమీపంలోని ఖోర్ ఫక్కన్ పోర్టు విస్తరణ కోసం సుమారు 2 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెడుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితి నుంచి తమ ఆర్థిక వ్యవస్థను, సరఫరా వ్యవస్థను సురక్షితంగా కాపాడుకోవాలనే యూఏఈ దీర్ఘకాలిక లక్ష్యానికి ఈ పరిణామాలు అద్దం పడుతున్నాయి.

## షేక్ హసీనాకు సవాల్ : చట్టం ముందు నిలవాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

నేరస్థురాలిగా ఆమె చట్టాన్ని ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. 2024 ఆగస్టులో జరిగిన ప్రజా తిరుగుబాటుతో బంగ్లాదేశ్‌ను వదిలి పారిపోయిన షేక్ హసీనా... ప్రస్తుతం భారత్ లో తలదాచుకుంటున్నారు. అయితే, ఈ ఏడాది చివరినాటికి ఆమె స్వచ్ఛందంగా ఢాకాకు చేరుకుని, తన 'అవామీ లీగ్' పార్టీని మళ్లీ బతికించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. హసీనా రాకపై బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రెహమాన్ సలహాదారు జాహెద్ ఉర్ రెహమాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 నాటి విద్యార్థుల ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసి, వందల మంది ప్రాణాలు తీసిన నేరాలపై హసీనా కోర్టులో పోరాడాలని ఆయన అన్నారు. దేశ ప్రజలంతా ఆమెకు పడిన మరణశిక్ష అమలు కావాలని కోరుకుంటున్నారని, ఆమె వస్తే న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ లో జరిగే ఈ విచారణ అంతా పారదర్శకంగా ఉంటుందని, ప్రపంచ దేశాల పరిశీలకులు దీనిని గమనించవచ్చని చెప్పారు. ఒకవేళ కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తే దానికి కూడా తాము సిద్ధమేనని, హసీనా రాకపై ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్... విద్యార్థుల నిరసనల అణచివేత కేసులో హసీనాకు ఆమె లేని సమయంలోనే మరణశిక్ష విధించింది. అయితే ఈ కేసులన్నీ రాజకీయ కక్షసాధింపు చర్యలేనని హసీనా కొట్టిపారేస్తున్నారు. అప్పటినుంచి ఆమెను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ భారత్‌ను కోరుతోంది. హసీనా తాజా ప్రణాళికలపై భారత విదేశాంగ శాఖ అత్యంత జాగ్రత్తగా స్పందించింది. భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "ఈ విషయంలో మా విధానంలో ఎలాంటి మార్పు లేదు. నేరస్థుల అప్పగింత అనేది పూర్తిగా ఒక చట్టపరమైన ప్రక్రియ. దాని ప్రకారం ఏది జరగాల్సి ఉంటే అది చట్టబద్ధంగానే జరుగుతుంది" అని చెప్పారు.

## విశ్వంలో చక్కెరను గుర్తించిన శాస్త్రవేత్తలు..

అంతరిక్షంలో చక్కెర అణువులను శాస్త్రవేత్తలు గుర్తించడం విశ్వంలో జీవం ఆవిర్భావంపై కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. 'నేచర్ ఆస్ట్రానమీ' జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ప్రకారం పాలపుంత గెలాక్సీ మధ్యభాగంలోని దట్టమైన వాయు మేఘంలో 'ఎరిథ్రులోజ్' అనే నాలుగు కార్బన్ అణువులతో కూడిన చక్కెరను అంతర్జాతీయ పరిశోధక బృందం గుర్తించింది. ఈ పరిశోధనకు ఖగోళ రసాయన శాస్త్రవేత్త ఇజాస్కున్ జిమెనెజ్ సెర్రా నాయకత్వం వహించారు. ఎరిథ్రులోజ్ అనేది థ్రియోస్ న్యూక్లిక్ యాసిడ్ (టీఎన్ఏ) ఏర్పాటుకు కీలకమైన రసాయనం. జీవం ఆవిర్భావానికి ముందు ఆర్ఎన్ఏ, డీఎన్ఏలకు పూర్వ రూపంగా టీఎన్ఏ ఉండి ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీంతో జీవం ప్రారంభానికి అవసరమైన రసాయన పదార్థాలు అంతరిక్షం నుంచే భూమికి చేరి ఉండొచ్చనే వాదనకు ఈ అధ్యయనం బలం చేకూర్చింది. స్పెయిన్‌లోని యెబెస్ 40 మీటర్ల రేడియో టెలిస్కోప్, ఐరామ్ 30 మీటర్ల టెలిస్కోప్ సాయంతో ఈ పరిశోధన నిర్వహించారు. G+0.6930.027 అనే మాలిక్యులర్ క్లౌడ్‌ను పరిశీలించిన శాస్త్రవేత్తలు, అక్కడ మూడు కార్బన్‌ల చక్కెరల కంటే ఎరిథ్రులోజ్ ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇది ఇప్పటి వరకు ఉన్న శాస్త్రీయ అంచనాలకు భిన్నమైన ఫలితమని పేర్కొన్నారు. భారీ ఉల్కాపాతం జరిగిన సుమారు 4.1 నుంచి 3.8 బిలియన్ సంవత్సరాల క్రితం ఈ తరహా చక్కెర అణువులు లక్షల నుంచి కోట్ల టన్నుల మేర భూమిపైకి చేరి ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు.

## కృష్ణా-గోదావరి సంగమం.. జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర కృష్ణాగోదావరి నదీ సంగమం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని ఆకాంక్షిస్తూ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జలవనరులే అభివృద్ధికి మూలమని స్పష్టం చేశారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి, రాష్ట్రాన్ని కరవు రహితంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. గోదావరి మిగులు జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి రాయలసీమ, కృష్ణా డెల్టాకు ప్రయోజనం చేకూర్చిన పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆయన కొనియాడారు. గతంలో ఈ ప్రాజెక్టుపై వచ్చిన విమర్శలను తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ వాటిని తిప్పికొట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎంపీ కేశినేని చిన్ని, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ అనే భేదం లేకుండా అన్ని ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

## సర్ డిక్లరేషన్ లో చేర్పులు వద్దు

న్యూఢిల్లీ : కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం 6 ఆన్‌లైన్ దరఖాస్తులో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన కొత్త డిక్లరేషన్‌ను చేర్చిన ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయంపై సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పు చట్టబద్ధ అధికార పరిధిని దాటి చేసిన చర్యగా (అల్ట్రా వైర్స్) కనిపిస్తోందని పేర్కొన్నారు. వెంటనే ఆ నిబంధనను ఉపసంహరించుకోవాలని వివరించారు. ఈ మేరకు జాన్ బ్రిట్టాస్.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఫారం6లో కొత్త ఓటరు.. ఆయన తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు సర్ అనంతరం రూపొందించిన ఓటర్ల జాబితాలో ఉన్నాయా లేదా అనే వివరాలను తప్పనిసరిగా ప్రకటించాల్సి వస్తోంది. అయితే డౌన్‌లోడ్ చేసుకునే ఆఫ్‌లైన్ ఫారం'6లో మాత్రం ఈ నిబంధన లేదు. సాధారణంగా ఫారం'6లో మార్పులు చేయాలంటూ ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 లేదా రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్ 1960లో సవరణలు చేయాల్సి ఉంటుందనీ, అలాంటి చట్టసవరణలు లేకుండానే ఈసీ కొత్త ప్రకటనను చేర్చిందని బ్రిట్టాస్ పేర్కొన్నారు.

## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం

అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ ($1) నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ బుధవారం వెల్లడించారు. ఈ నాణేనికి ఒకవైపు ట్రంప్ చిత్రం ఉండగా, దానిపై "లిబర్టీ", దిగువన "17762026" అనే సంవత్సరాలను ముద్రించారు. చిత్రానికి పక్కన "ఇన్ గాడ్ వుయ్ ట్రస్ట్" అని వాక్యం ఉంటుంది. నాణేనికి రెండో వైపు రెక్కలు విప్పిన గద్ద, దాని మధ్యలో 250వ సంఖ్యతో కూడిన రక్షణ కవచం (షీల్డ్) ఉంటుంది. దానిపై "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా", "వన్ డాలర్" అనే అక్షరాలు ఉంటాయి. ఈ సందర్భంగా స్కాట్ బెస్సెంట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "అమెరికా 250 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల వేళ, స్వేచ్ఛకు, దేశభక్తికి చిహ్నంగా ఈ కొత్త బంగారు నాణేన్ని యూఎస్ మింట్ ముద్రించనుంది. ట్రంప్ చిత్రంతో కూడిన ఈ నాణెం అమెరికా విలువలను, స్వేచ్ఛను పరిరక్షిస్తామన్న దేశ నిబద్ధతను చాటుతుంది" అని పేర్కొన్నారు.

# రమణమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

* ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : బిజెపి పార్టీ రాజకీయాల కోసం దేవుళ్లను వాడుకోవడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ అన్నారు. బి ఆర్ కే చానల్ లైవ్ డిబేట్‌లో విజయ విహార రమణమూర్తిపై జరిగిన భౌతిక దాడిని ఖండిస్తూ మంగళవారం శేషగిరిభవన్'లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి ఆర్ కే లైవ్ చర్చలో బిజెపి అనేది రాజకీయ పార్టీ అని, రాముడు, కృష్ణుడిని మతం పేరుతో వాడుకోవటం సరికాదు అన్నందుకు బిజెపి మతోన్మాది వెంటనే లేచి రమణమూర్తి మీద చేయి చేసుకోవడం సరి కాదన్నారు. ప్రజా వ్యతిరేక బిజెపి పాలనలో అరాచకం పెరుగుతోందని, ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని ఆయన అంటూ దాడిని ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, పట్టణ నాయకులు సంతోష్ పాల్గొన్నారు.

# నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల గడువు జూలై 31 వరకు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): 2027-28 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే జేఎన్‌వీఎస్‌టీ-2027 (JNVST2027) ఎంపిక పరీక్షకు ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మామునూర్ పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్. ప్రవీణ్ కుమార్ తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థుల జనన తేదీ 2015 మే 1 నుంచి 2017 జూలై 31 మధ్య ఉండాలని తెలిపారు.ప్రవేశ పరీక్ష 2026 నవంబర్ 28న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఉచిత విద్య, వసతి, భోజనంతో పాటు సీబీఎస్ఈ విధానంలో నాణ్యమైన విద్య అందిస్తారని చెప్పారు.అర్హులైన విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

* సమగ్ర భూ సర్వేతో అర్హులకే పట్టాలు: ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): గ్రామాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపట్టిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎం. కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన భూ సర్వే గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రస్తుతం భూమిని సాగు చేస్తున్న వ్యక్తి ఒకరైతే, పట్టాదారు పాస్‌పుస్తకం మరొకరి పేరుపై ఉండడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర భూ సర్వే అత్యంత అవసరమని చెప్పారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు గ్రామస్థులతో సమన్వయం చేసుకుని పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. వాస్తవంగా భూమిని సాగు చేస్తున్న అర్హులైన రైతులను గుర్తించి నిబంధనల ప్రకారం పట్టాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ, గ్రామకంఠం, ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను గుర్తించడంలో కూడా ఈ సర్వే కీలకంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఆక్రమిత ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం సులభమవుతుందని పేర్కొన్నారు.పట్టాదారు పాస్‌పుస్తకం రైతులకు అత్యంత కీలకమైన పత్రంగా పేర్కొన్న ఆయన, పంట రుణాలు, రైతు భరోసా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఇది అవసరమని చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు, పాస్‌పుస్తకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.గ్రామసభలో స్థానిక సర్పంచ్, ఆర్డీవో, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఈనెల 19న దీన విజ్ఞాన మందిర్ స్వర్ణోత్సవాలు

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: పట్టణంలోని దీన విజ్ఞాన మందిర్ పాఠశాల స్వర్ణోత్సవాలను ఈనెల 19న ఎంఎ బేగ్ ఫంక్షన్ హాల్ లో అంగరంగబైభవంగా నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సహితరాన్ని తెలిపారు.పాఠశాలలో స్వర్ణోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. అనంతరం కరస్పాండెంట్ సంహిత రాణి అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.1976లో తన తల్లి దీనారాణి పాఠశాలను స్థాపించినట్లు తెలిపారు. చీకటిలో ఉన్న విద్యార్థులను వారి జీవితాల్లో వెలుగులు నింపాలని దీనారాణి ఆశయం అని తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో అబిస్టా పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగికదాడి కేసులో నలుగురు నిందితుల అరెస్టు

* పరారీలో మరో ఇద్దరు... మూడు ఆటోలు, సెల్‌ఫోన్లు స్వాధీనం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఎల్.ఆదినారాయణ తెలిపారు. బుధవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైనర్ బాలికను గరీబ్‌పేటకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి ప్రేమ పేరుతో వెంబడించేవాడు. రామకృష్ణ తన స్నేహితులు జాలె నవీన్, గణేష్‌ల సహకారంతో ఈనెల 3వ తేదీన ఆటోలో బాలికను బలవంతంగా కొత్తగూడెం పట్టణం పాత బస్‌డిపో పరిధిలోని తన బావ వెంకటేష్‌కు చెందిన గదికి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు చేశాడు. ఈ విషయాన్ని రామకృష్ణ స్నేహితులైన కలకుంట్ల విజేందర్, బడేటి మహేష్‌లకు తెలియచేయగా, వారిద్దరూ ఈనెల 4, 5వ తేదీల్లో వేరవేరుగా బాలికను బ్లాక్‌మెయిల్ చేసి బలవంతంగా ఆటోలో బయటకు తీసుకువెళ్లి లైంగిక దాడి చేశారు. బాలిక తనపై జరిగిన లైంగికదాడి విషయాన్ని తల్లికి తెలియచేయడంతో ఈనెల 11వ తేదీన బాలిక తల్లి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా, బుధవారం లైంగికదాడికి పాల్పడిన రామకృష్ణ, కలకుంట్ల విజేందర్, బడేటి మహేష్, జాలె నవీన్‌లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. సుజాతనగర్ మండలానికి చెందిన నిందితులు గణేష్, వెంకటేష్‌లు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి సి.ఐ. కరుణాకర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



# అద్దె వాహనాల బకాయిలు చెల్లించాలి

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: పెట్రోలు, డిజిటల్ ధరలు పెరిగినందున జిల్లా కలెక్టర్ కార్యాలయం లో వివిధ శాఖలకు వినియోగించే అద్దె వాహనాలకు చెల్లించే అద్దెలను పెంచాలని అద్దె వాహన యజమానుల అసోసియేషన్ అధ్యక్షులు చింతలచెరువు పవన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అద్దె కార్లతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గతంలో పెట్రోలు ధర లీటరు 54/ వున్నప్పుడు అద్దె వాహనాలకు నెలకు 33000/ చెల్లించే వారని, ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరు 106/ వున్నందున అద్దె వాహనాలకు నెలకు 55000/ చెలించాలని వారు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం లో అద్దె వాహనాల డ్రైవర్ లకు రెస్ట్ రూం సౌకర్యం కల్పించాలని, కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. వివిధ విభాగాల నుండి అద్దె వాహనాలకు గత పది నెలల నుండి కిరాయిలు చెల్లించడం లేదని, అద్దె వాహనాలకు బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ కు ప్రజావాణి లో తమ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. కాబట్టి తమకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, తాము డ్రైవర్ లకు వేతనాలు, పెట్రోల్ ఖర్చులు స్వంతంగా చెల్లించవలసి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ వెంకన్న, కోశాధికారి తన్నీరు మహేష్, సభ్యులు రహీం, సాయికుమార్, హరీష్, సందీప్, ప్రదీప్, జీవన్, కృష్ణ, గోవర్దన్, శ్రీకాంత్, సిద్దార్థ, మధు, షరీఫ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కుంభంను కలిసిన నూతన సింగల్ విండో చైర్మన్ గరిసె రవి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గా నూతనంగా ఎంపికైన గరిసె రవి బుధవారం భువనగిరిఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ రైతుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేయాలని కోరారు ఇంకా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని సూచించారు ఈ సందర్భంగా రవి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తన పట్ల ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చినందుకు విశ్వాసంతో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానని అన్నారు అదేవిధంగా సంఘం అభివృద్ధి కోసం నిరంతరం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్, పాపిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ నాయకులు బత్తిని లింగయ్య, గంగాపురం సతీష్ గౌడ్, పలుసం సతీష్‌గౌడ్, కాసుల వెంకన్న, కొండూరు సాయి, బత్తిని నాగేష్, జంగారెడ్డి ,చిలుకూరు సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారం అభినందనీయం : ఎంఈఓ లీలా



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుజాత నగర్ మండలం పాత , కొత్త అంజనాపురం గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుచున్న 50 మంది విద్యార్థులకు పోక వెంకటేశ్వర్లు, వెంగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు పోక శ్రీనివాసరావు, సృజన దంపతుల ఆర్థిక సహకారంతో సుమారు ఇరవై వేల రూపాయలు విలువైన యాబై స్కూల్ బ్యాగ్ లు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్లు, షార్పనర్లు, రబ్బర్లు అందజేయడంతో పాటు అమర్ ఎంటర్ ప్రైజెస్ సహకారంతో ప్రతి విద్యార్థికి రెండు పెన్నులు అందజేసారు. ఈ సందర్భంగా ఎంఈఓ లీలా మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ సేవలు అభినందనీయమని , వారు పలు గ్రామాలలోని పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించారని ఆమె అంటూ వారి సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్ కుమార్, హెచ్ఎమ్స్ శ్రీనివాస రావు, మంగమ్మ, సర్పంచ్ లు వజ్జా రామారావు, ఎట్టి నిర్మల, ఉప సర్పంచ్ కొల్లు స్వరూప రాణి, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, మైనేని నాగేశ్వరరావు, ధర్మారావు, రాజేంద్ర ప్రసాద్, గురుమూర్తి ఎనిగళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేలో తప్పులకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలి

* గణపురంలో భూ రీ-సర్వేను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): భూ రీసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం గన్‌పూర్ మండలం గన్‌పూర్ శివారులో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు భూముల కొలతలు తీస్తున్న విధానం, రికార్డుల నమోదు ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన రోవర్ పరికరం ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా భూముల సరిహద్దులను గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్న తీరును పరిశీలించి, ఇదే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. భూ రీసర్వేతో భూముల సరిహద్దులు స్పష్టమై, రైతుల మధ్య నెలకొనే వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. రైతుల భూ హక్కులు మరింత బలపడటంతో పాటు భవిష్యత్తులో సరిహద్దు వివాదాలు తలెత్తకుండా ఈ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగాలని, ప్రతి రైతు భూమి వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే విజయవంతం కావడానికి రైతులు, ముఖ్యంగా సరిహద్దు భూములు కలిగిన రైతులు తప్పనిసరిగా పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తహశీల్దార్ రాజేశ్వరరావు, మండల సర్వేయర్ తిరుపతి, లైసెన్స్డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై మాజీ ఎమ్మెల్యే గండ్ర క్షేత్రస్థాయి పరిశీలన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సుభాష్ కాలనీలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న నమోదు ప్రక్రియను నిశితంగా పరిశీలించిన ఆయన, ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తుల సంఖ్య, డిజిటలైజ్ చేసిన ఓటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగాలని సూచించిన మాజీ ఎమ్మెల్యే, అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని గండ్ర వెంకట రమణారెడ్డి ఆకాంక్షించారు.

# రైతులు ఎరువుల కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

* ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : చుంచుపల్లి మండల పరిధిలోని హౌసింగ్ బోర్డ్ గ్రామం నందు గల కొత్తగూడెం సొసైటీ అధ్యక్షులు మండే వీర హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు కేంద్రాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే ముందుగా రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు . ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్ , సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా , చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి , ఏవో లు రాజేశ్వరి కరుణామయి ,ఏఈఓలు మమత, ప్రసాద్, సర్పంచ్ లు వీరన్న భూక్య శాంతి శ్రీ , సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగిల్ విండో చైర్మన్ గా గరిసె రవి




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గామల్లేపల్లి గ్రామానికి చెందిన గరిసె రవి నీ నియమిస్తూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు గతంలో రవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేసే కాంగ్రెస్ పార్టీకి సేవలందించారు ఇంకా ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఈ పదవిని కట్టబెట్టారు సందర్భంగా గరిస రవి మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్యే తనకు ఈ పదవిని ఇచ్చినందుకు కృతజ్ఞతలను తెలియజేశారు నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమం కోసం పాటుపడతానని ఆయన అన్నారు.

# మెదక్ ఖిల్లా అభివృద్ధిలో భాగంగా వివిధ పనులను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ నవీన్



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని అతి పురాతనమైన కట్టడాలలో ఒకటైన మెదక్ ఖిల్లా అభివృద్ధిలో భాగంగా బుధవారం మెదక్ ఖిల్లా పై చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్ పర్యవేక్షించినారు. మెదక్ ఖిల్లా కోట గోడలను డామేజ్ చేసే విధంగా పెరిగిన చెట్లను మరియు పర్యాటకులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న చెట్లను తొలగించి ఎలాంటి ఇబ్బందులను కలిగించకుండా చూడాలన్నారు. ఈ పనులను మెదక్ మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించి పనులను చేయిస్తున్న సూపర్వైజర్లకు సూచనలు జారీ చేశారు. అభివృద్ధి పనులు చేయడం వల్ల మెదక్ ఖిల్లా కు వచ్చే పర్యాటకులకు ఖిల్లా ప్రాంతమంతా ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆన్లైన్ లోనే ఇసుక బుకింగ్ ప్రక్రియ జరగాలి

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా ఆన్లైన్ లోనే బుకింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇసుక సరఫరాపై వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరా ఆన్లైన్ లో పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఎంత పరిమాణం ఇసుక, ఎక్కడెక్కడి నుండి పొందింది నివేదిక స్సర్పించాలన్నారు. ఇసుకను టీజీఎండీసీ, స్యాండ్ బజార్, స్థానికంగా సమకూర్చుకోవాలని, ఇదీ బుకింగ్ ఆన్లైన్ లోనే చేయాలని అన్నారు.జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్ లలో 1000 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ఇసుక రీచ్ ల వారీగా వచ్చిన ఆదాయం వివరాలు వెంటనే సమర్పించాలని, ఇట్టి ఆదాయాన్ని నిబంధనల మేరకు ఆయా గ్రామ పంచాయతీ తదితరాలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు.ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై సమస్యలు ఉంటే వెంటనే నివేదిక అందించాలని, అట్టి సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖలచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్ణీత గడువులోపు అభివృద్ధి పనుల పూర్తికి కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీవో టిజిఎండిసి జి. శంకర్, మైన్స్ ఏజి ఏ. రమేష్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, పీఆర్ ఇఇ లు మహేష్ బాబు, రామకోటి, డిఇ లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌లో మొగిలిపాక వాస్తవ్యులు డాక్టర్ ముద్దసాని రామచంద్రారెడ్డి దంపతులు నిర్వహించిన శ్రీనివాస కళ్యాణ మహోత్సవంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ఎమ్మెల్యే శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వలిగొండ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## 42 కోట్లతో సంగెం బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే కుంభం

వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండలం సంగెం బొల్లెపల్లి గ్రామాల మధ్య ఉన్న మూసి బ్రిడ్జి పనులకు గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ తెలిపారు గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి పునర్జీవ ప్రక్షాళనలో భాగంగా సంగం వద్ద మూసి జలాలను పరిశీలించి అక్కడే సభను ఏర్పాటు చేసి అదే రోజు నూతన బ్రిడ్జి నిర్మాణానికి 42 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారంగా నిధులను మంజూరు చేయడంతో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి నేడు ఇట్టి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సహదేవ్ తెలిపారు ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు అన్నారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

*** బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : నీట్ పరీక్ష వైఫల్యాలపై, 18 మంది విద్యార్థుల మరణాలకు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గత 18 రోజులుగా ప్రముఖ మానవ హక్కుల నేత, పర్యావరణవేత్త జమ్మూ& కాశ్మీర్ కు సంబంధించిన వ్యక్తి సోనం వాంగ్ చుక్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరుగుతుందని ఇట్టి దీక్షకు మద్దతుగా అభిజిత్ దుల్కే అధ్యక్షత వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఎంతోమంది విద్యార్థి సంఘ నాయకులు వివిధ పార్టీలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని హుస్నాబాద్ బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పశ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా,రేపు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్ చుక్ ప్రాణానికి ఎటువంటి అపాయం కలిగిన కేంద్రంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ పక్షాన హెచ్చరించడం జరుగుతుందని, మోడీ ప్రభుత్వం లో ఎంత అవినీతి జరిగినా నోరు మెదపకుండా ప్రజాస్వామ్యానికి జవాబు చెప్పకుండా దాటవేస్తూ, ప్రతిపక్షాల గొంతులు అణిచివేయాలని చూడడం చాలా బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం కాక్రోచ్ జనతా పార్టీ తో చర్చలు జరపకపోతే జూలై 20వ తేదీ నాడు యువత పార్లమెంటు ముట్టడికి పెద్ద ఎత్తున సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్. ఎలగందుల శంకర్ వేల్పుల రాజు, మారిశెట్టి సుధాకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**– 36 కేసులు నమోదు, రూ.7,510 జరిమానా విధింపు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు బుధవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలే లక్ష్యంగా ఈ డ్రైవ్ కొనసాగింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 36 వాహనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి, రూ. 7,510/- జరిమానా విధించి వసూలు చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వాహన యజమానులు అందరూ తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలి

*** ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరిలో జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ అధ్యక్షతన జిల్లా నేరాల సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు, శాంతిభద్రతలు, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ భద్రత, సాంకేతిక వనరుల వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యతతో కూడిన విచారణ జరిపి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేరాల నివారణలో భాగంగా విజిబుల్ పోలిసింగ్ ను మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామస్థాయిలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను పటిష్ఠం చేసి నేరాలను ముందుగానే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమన్ వాయు పోర్టల్ మరియు సి ఈ ఐ ఆర్ పోర్టల్ లను సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ వంటి అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. అలాగే లా అండ్ ఆర్డర్, సి సి ఎస్, సైబర్ సెల్, ఐ టి సెల్ ల మధ్య సమన్వయాన్ని మరింత పెంచి కేసుల ఛేదనను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. గ్రామాల వారీగా సి సి టివి కెమెరా నెట్‌వర్క్ విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.అదేవిధంగా పెట్రోలింగ్, నాకాబందీ, వాహన తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించి నేరస్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, సైబర్ నేరాల నివారణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన మరియు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికార బాధ్యత అని పేర్కొన్న జిల్లా ఎస్పీ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా అంకితభావంతో పనిచేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, సీసీఎస్, సైబర్ సెల్, ఐటీ సెల్ , ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రేమ వ్యవహారమే కారణంగా వ్యక్తి దారుణ హత్య!



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ప్రజా స్ఫూర్తి: రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం... నారాయణపూర్ ఎస్సీ కాలనీకి చెందిన వేమునూరి స్వామి (48, వృత్తి: కూలీ) మేనకోడలికి, మృతుడి అన్న కుమారుడికి మధ్య ఉన్న ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు దారితీసింది. ఈ ప్రేమ వ్యవహారం నచ్చని కాగజ్‌నగర్ మండలం గెర్రగూడ (రాసపల్లి జీపీ) గ్రామానికి చెందిన మేనల్లుళ్లు ఇరిగిరాల తిరుపతి, ఇరిగిరాల వెంకటేష్ అనే అన్నదమ్ములు ఇద్దరూ.. దీనికంతటికీ స్వామే కారణమని భావించి పథకం ప్రకారం పగ పెంచుకున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి సుమారు 11:30 గంటల ప్రాంతంలో బైక్‌పై నారాయణపూర్ ఎస్సీ కాలనీకి చేరుకున్న నిందితులు, మాట్లాడదామని స్వామిని పిలిచి గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. అనంతరం వెంట తెచ్చుకున్న పదునైన మారణాయుధాలతో స్వామిపై విచక్షణారహితంగా దాడి చేసి, నరికి అక్కడికక్కడే పడేసి పారిపోయారు. మృతుడికి భార్య దేవాల (40), ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెబ్బెన పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సంఘటనా స్థలాన్ని ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, రెబ్బెన సీఐ సంజయ్, ఎస్ఐ వెంకటకృష్ణలు సందర్శించి పరిశీలించారు. క్లూస్‌టీమ్ సహాయంతో ఘటనా స్థలంలో కీలక ఆధారాలు సేకరించామని, కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ సంజయ్ వెల్లడించారు.

## మూర్ఛ వచ్చి పడిపోయిన వ్యక్తిని కాపాడిన పోలీస్ సిబ్బంది

*** తన నగదు 108000 అప్పజెప్పిన పోలీస్ సిబ్బందిని అభినందించిన జనం**



ప్రజాస్ఫూర్తి, జన్నారం : మానవత్వం చూపి ఒక వ్యక్తి ప్రాణాలను , అతని వద్ద ఉన్న లక్ష 8 వేల రూపాయల నగదును ఆ వ్యక్తి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అందించిన సంఘటన జన్నారంలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే గత ఆదివారం రాత్రి 10:37 గంటలకు జన్నారం పట్టణంలో ఒక వ్యక్తికి మూర్ఛ వచ్చి నోటి నుండి నురుగు రావడంతో గమనించిన బ్లూ కోర్ట్ పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ దేవన్న హోంగార్డు నీలయ్య లు జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్ఐ ఉదయ్ కిరణ్ స్పందించి ఆ వ్యక్తిని అంబులెన్స్ ద్వారా లక్షెట్టిపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను పడిపోయిన ప్రాంతంలో పరీక్షించగా ఒక కవర్లో లక్ష ఎనిమిది వేల రూపాయల నగదును గుర్తించారు. ఆ నగదును స్వాధీనపరచుకొని ఆ వ్యక్తి యొక్క వివరాలను ఆరా తీశారు. విచారణలో ఆ వ్యక్తి జన్నారం మండలం నూతన గ్రామానికి చెందిన కురుసింగా దేవరావు గా గుర్తించారు. మంగళవారం రోజున లోతుర్రే గ్రామ సర్పంచ్ బోడ శంకర్ సమక్షంలో దేవరావుకు అప్పగించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ తన ప్రాణాన్ని కాపాడటమే కాకుండా తను పోగొట్టుకున్నాను అని భావించిన లక్ష 8 వేల రూపాయల నగదును పోలీస్ సిబ్బంది తిరిగి ఇవ్వడంతో ఆనందభాష్పాలతో కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ ఎస్సై ఉదయ్కిరణ్ మరియు బ్లూ కోర్టు సిబ్బంది అయినా దేవన్న, నీలయ్యల కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో ఎవరూ కూడా ఇలా పెద్ద మొత్తంలో నగదును తీసుకురావడం తీసుకు వెళ్ళడం చేయకూడదని, అత్యవసరమైతే జాగ్రత్తగా ఉండాలని, ప్రజలను కోరారు.

## ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాల్సిందే

*** నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాలమహానాడు అండ్ రాక్స్ చైర్మన్ డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్**



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : ఎస్సీ వర్గీకరణను పూర్తిగా రద్దు చేయాల్సింది అని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాలమహానాడు అండ్ రాక్స్ చైర్మన్ డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వలన తెలంగాణలో మాల సామాజిక వర్గం పూర్తిగా ఉనికి కోల్పోయిందని ఆంధ్రలో వెంటిలేటర్ పై ఉన్నదని అన్నారు ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర జరిగిందని ప్రజాస్వామ్య బద్ధంగా జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీరం సతీష్ కుమార్, ఈద అంజయ్య,, మానే కాశయ్య, బోగరి విజయ్ కుమార్, అనిమల్ల నరహరి నానీ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## సర్ సవరణలో ప్రజలంతా ఓటు హక్కును కాపాడుకోండి

*** బీఆర్ఎస్ పార్టీ 6వ వార్డు బూత్ ఇంచార్జ్ ఖాదర్ బాబా**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలులో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ 6వ వార్డు బూత్ ఇంచార్జ్ ఖాదర్ బాబా బేతోల్ గ్రామంలో బీఎల్ఓతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకొని ఓటరు వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుముక్క లాంటి ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయడమే ఈ ప్రత్యేక సర్వే ముఖ్య ఉద్దేశ్యామని తెలిపారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ను ప్రజలు సదునియోగం చేసుకోవాలన్నారు.18 ఏళ్లు నిండిన యువత వంద శాతం ఓటు హక్కు పొందాలి. అలాగే ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (సర్) ప్రక్రియను ప్రతి ఒక్కరు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఎస్ ఐ ఆర్ సవరణను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కురవి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనుమురేషన్స్ ఫార్మ్స్ పంపిణీ చేయడం పూర్తి అయ్యిందని,డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి బూతు లెవల్ అధికారులు వెళ్లి వివరాలు సేకరించి 2002 ఓటరు జాబితా ప్రకారం వివరాలు సేకరించాలని, అందుబాటులో లేని వివరాలను గుర్తించాలని, వేగంగా ఈ ప్రక్రియ మొత్తం కొనసాగాలని ఆదేశించారు, ఇప్పటికే జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ,ఎంపీడీవో వీరబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు. 52వేలు నగదు స్వాధీనం

ప్రజాస్ఫూర్తి, నల్గొండ : 47 చోరీ కేసుల్లో నిందితుడుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగను నల్లగొండ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని సీఐ రాఘవరావు వెల్లడించారు.మంగళవారం టూ టౌన్ సర్కిల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3 రాత్రి సమయంలో నల్లగొండ పట్టణంలోని రామగిరిలో ఉన్న హనుమాన్ స్పోర్ట్స్ షాప్ షట్టర్ తాళాన్ని పగులగొట్టి, షాపులోని కౌంటర్‌లో భద్రపరిచిన రూ.3,40,000 నగదును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించారని బాధితుడి ఫిర్యాదు మేరకు నల్లగొండ టు టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు.ఈ చోరీ కేసును నల్లగొండ టు టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించి దొంగనా అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ దొంగ అంతర్ రాష్ట్ర పాత నేరస్థుడిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న పాత నేరస్థుడిని నిందితుడి వద్ద నుండి రూ.52,000 నగదును స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.అరెస్టు చేసిన నిందితుడు కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు ప్రస్తుతం కర్మన్‌ఘాట్, హైదరాబాద్ లో నివాసం ఉంటున్నాడని స్వ గ్రామం ఏడిద గ్రామం, మండపేట మండలం, తూర్పు గోదావరి జిల్లా అని ఇతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 47 చోరీ కేసులు నమోదై ఉన్నాయని రాత్రి వేళల్లో ఇళ్లు, వ్యాపార సంస్థలు, షాపులను లక్ష్యంగా చేసుకుని షట్టర్లు లేదా తాళాలు పగులగొట్టి నగదు, విలువైన వస్తువులను అపహరించడం ఇతని నేర పద్ధతి అన్నారు.గతంలో పలుమార్లు అరెస్టై జైలు శిక్ష అనుభవించిన అనంతరం హైదరాబాద్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నప్పటికీ తన నేరప్రవర్తనను విడిచిపెట్టకుండా వరుస చోరీలకు పాల్పడుతున్నాడు.ఇటీవల తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసులో జైలుకు వెళ్లి విడుదలైన తర్వాత సత్తుపల్లి, మెదక్, సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు షట్టర్ లిఫ్టింగ్ చోరీలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని వివరించారు.ఈ కేసును నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో నల్లగొండ టు ఎస్ఐ డి. సైదబాబుతో పాటు పోలీసు సిబ్బంది లావూరి బాలకోటి, మహమ్మద్ షకీల్ సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసినందుకు జిల్లా ఎస్పి అభినందించారు.

## కారు ఢీకొని వృద్ధుడు మృతి



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాలఘణపురం మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని నెల్లుట్ల లో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం బండ్లగూడెం గ్రామానికి చెందిన బండి రాంనర్సయ్య గౌడ్ (60) తన టీవీఎస్ ఎక్స్ఎల్ (ఏపీ 36 ఏవీ 0580) పై రహ దారి దాటుతుండగా, జనగామ నుంచి దేవరుప్పుల వైపు వెళ్తున్న కారు ఢీకొ ట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయ పడి న వ్యక్తి ని వెంటనే జిల్లా కేంద్రం లోని ప్ర భుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

## ఓటర్ల సవరణ ప్రక్రియ జూలై 24 లోపు పూర్తి చేయాలి : ఈఆర్ఓ



జనగామ, ప్రజాస్ఫూర్తి : భారత ఎన్నిక ల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) కార్యక్రమాన్ని నిర్ణీ త గడువులోగా పూర్తి చేయాలని రెవె న్యూ డివిజనల్ అధికారి, ఎలక్టోరల్ రి జిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) సూచిం చారు.బు ధవారం ఆర్డీఓ కార్యాలయం లో 98జన గామ అసెంబ్లీ నియోజకవ ర్గానికి చెంది న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. సమావేశంలో ఈఆర్ఓ మా ట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇం టింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల సే కరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ ను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), రాజకీయ పార్టీల ప్రతిని ధులు, ప్రజలు భాగస్వాములై సహక రించాలని కోరారు. ఈ ప్రక్రియను ఈఆ ర్ఓ, ఏఈఆర్ఓల పర్యవేక్షణలో నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జూలై 31లోపు ముసాయి దా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు.ఓటర్ల సవరణ కార్యక్రమా న్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒ క్కరూ సహకరించాలని ఈఆర్ఓ, ఏఈ ఆర్ఓలు విజ్ఞప్తి చేశారు.

## నిబంధనలు ఉల్లంఘించిన భవనాన్ని సీజ్ చేసిన అధికారులు




జనగామ, ప్రజాస్ఫూర్తి : ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించిన నేపథ్యంలో ప ట్టణ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్ లో ఉన్న ఓ భవనాన్ని అధికారు లు తనిఖీ చేసి, పలు నిబంధనల ఉల్లం ఘనలు గుర్తించి భవన వినియోగాన్ని తక్షణమే నిలిపివేశారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు భవనాన్ని పరిశీలించారు. నివాస గృహ నిర్మాణానికి అనుమతి పొందిన భవనా న్ని వాణిజ్య అవసరాలకు వినియోగి స్తున్నట్లు గుర్తించారు. భవనంలో కెనరా బ్యాంక్, డీసీసీ బ్యాంక్ శాఖలతో పాటు విద్యా సంస్థలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా స్టి ల్ట్ ఫ్లోర్‌ను పార్కింగ్ నిబంధనలకు విరు ద్ధంగా వినియోగించడం, తప్పనిసరి సె ట్‌బ్యాక్‌లను పాటించకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్లు తెలిపారు. ఈ నిబంధనల ఉల్లంఘనల వల్లే అగ్ని ప్రమాదానికి అనుకూల పరిస్థితులు ఏ ర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించిన అధి కారులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్ర త దృష్ట్యా భవన వినియోగాన్ని తక్షణ మే నిలిపివేస్తూ (బిల్డింగ్ సీజ్) చర్యలు చేపట్టారు. తనిఖీలో విద్యాశాఖ అదన పు డైరెక్టర్ కార్యాలయ ప్రతినిధులు, టీ ఎస్ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, జిల్లా ఫైర్ ఆఫీసర్, పట్టణ ప్ర ణాళిక విభాగం అధికారులు, మున్సిప ల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుమ్మరి కుంట పూడికతీత పనులకు అధికారులు అనుమతి ఇవ్వాలి

* **అధికారులకు రైతులు విజ్ఞప్తి**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మహమ్మదాపూర్ రోడ్ లో ఉన్న సర్వే నెంబర్ 81 లో చిన్న కుమ్మరి కుంట ఒక ఎకరం 12 గుంటల విస్తీర్ణంలో ఉండేది పూర్వకాలం నుంచి చుట్టుపక్కల రైతుల పంట పొలాలకు నీరు అందిస్తూ వస్తుంది అయితే గత కొన్ని సంవత్సరాలుగా కుంట పూడిక తీయకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి చుట్టుపక్కల బావులలో బోర్లలో నీటి సామర్థ్యం పూర్తిగా నశించిపోయింది దాని ద్వారా కుంటలో నీళ్లు నిలువక బావులలో నీరు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు 2023 నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న చిన్న కుమ్మరి కుంట సమస్యకు పరిష్కారం చూపించడం లేదని తూతూ మంత్రంగా హద్దులు నిర్ణయించారు తప్ప కుంట విస్తీర్ణం నీటి సామర్థ్యం బోర్డును ఏర్పాటు చేయలేదని కుంట పూడిక లేకపోవడం వలన నీరు నిలువ ఉండక పోవడంతో భూగర్భ జలాలు నశించాయని పంటలు పండించలేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా అధికారులు స్పందించి చిన్న కుమ్మరి కుంట పూడిక తీసేందుకు పర్మిషన్ ఇచ్చి భూగర్భ జలాలను పెంచేందుకు సహాయ సహకారాలు అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు రాజకీయాలకు తావు లేకుండా రైతుల సంక్షేమం దృష్ట్యా చిన్నకుమ్మరి కుంట సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు ఆలోచన చేసి మట్టి తీసేందుకు పర్మిషన్ ఇవ్వాలని రైతులు తీవ్ర ఆవేదనతో విజ్ఞప్తి చేశారు.

# యశోద హాస్పిటల్ లో విజయవంతంగా ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్స

* **యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ వెల్లడి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో, ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బ తిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' (కృత్రిమ గుండె ఊపిరితిత్తుల పరికరం) విధానం ఒక సం జీవనిలా మారుతోందని హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. బుధవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ తపస్వి కృష్ణ మాట్లాడుతూ యశోద హాస్పిటల్ సోమాజిగూడ లో ఊపిరితిత్తుల మార్పిడి సర్జరీ ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఊపిరితిత్తులు కరోనా వలన గాని, శ్వాసకోశ సంబంధం కల వ్యాధులతో, సిమెంట్ కం పెనీ లో దుమ్ము వలన కాని రోగి ఆక్సిజన్ సిలిండర్ లేకుండా బతకలేని స్థితిలో వున్న వారికి యశోద హాస్పిటల్ నందు ఊపిరితిత్తుల మార్పిడి సర్జరీ చేస్తామని చెప్పారు. చివరి దశ 'ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్' లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ 'వెనోవీనస్ ఎక్మో' లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని. ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది. ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి, దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు, దాత దొరికేవరకు , ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు. గుండెఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందని. ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎక్మో వంటి అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపడం సాధ్యమేనని స్పష్టం చేశారు. శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం , వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి, కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని. ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ (రిహాబిలిటేషన్) ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు.ఈ విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగం సీనియర్ మేనేజర్ పరమేష్, మేనేజర్ ఉమేష్ , అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘంలో పదవుల విక్రయంపై తీవ్ర ఆరోపణలు

* **ఆర్యవైశ్య సంఘం నాయకులు బొమ్మిడి అశోక్ ఆరోపణ**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఆర్యవైశ్య సంఘంలో పదవులను డబ్బులకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ఆర్యవైశ్య సంఘం నాయకులు బొమ్మిడి అశోక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రం వాణిజ్య భవన్ సెంటర్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికల్లో బెలిదే శ్రీనివాస్ గెలుపు కోసం తన వ్యక్తిగత పనులను పక్కనపెట్టి ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేశానని తెలిపారు. ఎన్నికల అనంతరం తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని కోరగా, ఆ పదవికి పోటీ ఎక్కువగా ఉండటంతో ఎవరికి ఇవ్వకుండా పూర్తిగా రద్దు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ హామీ ఇచ్చారని చెప్పారు. సంఘానికి చెడ్డపేరు రాకూడదనే ఉద్దేశంతో తాను కూడా ఆ నిర్ణయాన్ని అంగీకరించానన్నారు. అయితే అనంతరం నిర్వహించిన సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్, పీఆర్‌వో పదవులను కమిటీ నుంచి తొలగిస్తున్నట్లు అందరి సమక్షంలో ప్రకటించినప్పటికీ, తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని రాచర్ల కమలాకర్‌కు రూ.10 లక్షలకు కేటాయించారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుని ఆ పదవిని పూర్తిగా రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. అవసరమైతే ఈ నెల 19న జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కూడా అడ్డుకుంటామని తెలిపారు. అలాగే ఈ విషయాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోమ సుమన్, వీరవెల్లి విజయ్, బజ్జూరి శ్రీనివాస్, గజ్జల నరేష్, ఇమ్మడి సందీప్, షీలా శంకర్, బొమ్మిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య బలోపేతానికి ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

: **రాయికల్ శ్రీనివాస్"**

ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయ వంతంగా అమలు చేయాలని ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్ అన్నారు.ఫరూక్‌నగర్ మండలంలోని రాసుమల్లగూడెం గ్రామ సర్పంచ్ నత్తి శివరాములు ఆహ్వానం మేరకు గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇంటింటికీ సాగుతున్న ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అవసరమైన పత్రాల సేకరణ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు.గ్రామ ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, అవసరమైతే సవరణలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, చించోడ్ గ్రామ సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, దేవునిపల్లి సర్పంచ్ మల్లేష్, కంసాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ తుపాకుల శేఖర్,చించోడు అనంతం,చించోడు రాజు,అప్పారెడ్డిగూడ డిప్యూటీ సర్పంచ్ సీతారాములు, గ్రామ అధ్యక్షుడు రాజేష్ రెడ్డి, వార్డ్ సభ్యుడు దంగుల నరేందర్, మెరుగు రవీందర్, తిరంగి నవీన్, నరసింహులు, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

* **విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ**

స్టేషన్ ఘనపూర్, ప్రజాస్ఫూర్తి : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకుని, భోజనం - చదువు - క్రీడలను దినచ ర్యలో భాగం చేసుకుంటేనే మంచి భవి ష్యత్ సాధ్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం స్టే షన్ ఘనపూర్ కేజీబీవీని సందర్శించి న ఆయన పాఠశాల నిర్వహణ, విద్యా ర్థులకు అందుతున్న సౌకర్యాలను క్షు ణ్ణంగా పరిశీలించారు. డైట్ చార్ట్ ప్రకా రం భోజనం అందిస్తున్నారా, చికెన్ పరి మాణం ఎంత తెచ్చారనే విషయాలను ఆరా తీశారు. పాఠశాల పరిసరాల్లో పా రిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని మున్సి పల్ కమిషనర్ ను ఆదేశించిన కలెక్టర్, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, వి ద్యార్థులకు అందిస్తున్న శిక్షణపై వివరా లు తెలుసుకున్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు అన్ అకాడమీ తరగతులను ప్రారంభించి, ఫాస్ట్ మ్యా థ్స్, గెట్ ఇట్ రైట్ పుస్తకాల ప్రాధాన్యత ను వివరించారు. ప్రతిరోజూ సాధన చే స్తేనే గణితంలో నైపుణ్యం పెరుగుతుం దని, పోటీ పరీక్షల్లో విజయానికి ఎంతో దోహదపడుతుందన్నారు.యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగ తులు విద్యార్థులకు మరింత ప్రయోజ నకరమని పేర్కొన్న కలెక్టర్, ఉపాధ్యా యులు ప్రణాళికాబద్ధంగా బోధన చేప ట్టాలని సూచించారు. సమస్యలు ఉం టే వెంటనే తమ దృష్టికి తీసుకురావాల ని ఎస్.ఓ ను ఆదేశించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.

## పేదల సొంతింటి కలకు అండగా టేస్టీ రెస్టారెంట్ యాజమాన్యం

* **మొగిలిగిద్దలో ఇందిరమ్మ ఇంటికి రూ.లక్ష సొంత ఖర్చుతో స్లాబ్**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో మొగిలిగిద్ద గ్రామంలో హోటల్ టేస్టీ రెస్టారెంట్ యాజమాన్యం మరోసారి ఆదర్శంగా నిలిచింది. తమ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు అండగా నిలుస్తూ మూడో ఇందిరమ్మ ఇంటికి రూ.1 లక్ష సొంత నిధులతో పైకప్పు (స్లాబ్) వేయించింది. మొగిలిగిద్ద గ్రామానికి చెందిన మున్నూరు శేఖర్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి నిర్మాణం పూర్తి చేయలేని పరిస్థితిలో ఉండగా, హోటల్ టేస్టీ రెస్టారెంట్ యాజమాన్యం భరోసా కల్పించి నిర్మాణానికి చేయూతనిచ్చింది. తమ వద్ద పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సహకరిస్తూ, ఇప్పటికే రెండు ఇళ్లకు సహాయం అందించగా, మూడో ఇంటికి రూ.1 లక్ష సొంత ఖర్చుతో స్లాబ్ వేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొగిలిగిద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## 20 ఏళ్ల నీటి నిరీక్షణకు తెర

: **గోలేటిలో హ్యాండ్ బోరు పునరుద్ధరణ**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని 11వ వార్డు ప్రజల దశాబ్దాల తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గత 20 సంవత్సరాలుగా వినియోగంలో లేక నిరుపయోగంగా మారిన స్థానిక హ్యాండ్ బోరుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విజయవంతంగా మరమ్మతులు పూర్తి చేసి, బుధవారం ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ప్రారంభించారు. వార్డులో నీటి ఎద్దడి కారణంగా స్థానికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన వార్డు సభ్యురాలు దుర్గం శ్రీవాణి.. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ బాబురావు, ఉపసర్పంచ్ దుర్గం తిరుపతి, మరియు గ్రామ కార్యదర్శిల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన సర్పంచ్, ఉపసర్పంచులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి, బోర్ బావిని తిరిగి ప్రజల వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచులు మాట్లాడుతూ.. గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడమే తమ ధ్యేయమని, భవిష్యత్తులోనూ ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యపై తక్షణమే స్పందించి తాగునీటి ఇబ్బందులను తొలగించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్, టీబీజీకేఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, స్థానిక వార్డు ప్రజలు నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు రాజకీయంగా ఎదగాలి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బీసీలు రాజకీయంగా ఎదగాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్ ను ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు జెకే శేఖర్ యాదవ్ ని శాల్వతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ మీ నాయకత్వంలో మంచి నాయకత్వన్ని తయారు చెయ్యాలి వారు కోరారు. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ తప్పకుండా మీలాంటి పెద్ద సలహాలు సూచనలు తీసుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బిజెపి నాయకులు కార్యకర్తలు మహిళా సోదరిమణులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు. 52 వేలు నగదు స్వాధీనం: సిఐ రాఘవరావు



ప్రజాస్ఫూర్తి.నల్లగొండ : 47 చోరీ కేసుల్లో నిందితుడుగా ఉన్న అంతర్‌రాష్ట్ర దొంగను నల్లగొండ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని సీఐ రాఘవరావు వెల్లడించారు. మంగళవారం టూ టౌన్ సర్కిల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3 రాత్రి సమయంలో నల్లగొండ పట్టణంలోని రామగిరిలో ఉన్న హనుమాన్ స్పోర్ట్స్ షాప్ షట్టర్ తాళాన్ని పగులగొట్టి, షాపులోని కౌంటర్‌లో భద్రపరిచిన రూ.3,40,000 నగదును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించారని బాధితుడి ఫిర్యాదు మేరకు నల్లగొండ టు టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు.ఈ చోరీ కేసును నల్లగొండ టు టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించి దొంగనా అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ దొంగ అంతర్ రాష్ట్ర పాత నేరస్థుడిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న పాత నేరస్థుడిని నిందితుడి వద్ద నుండి రూ.52,000 నగదును స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.అరెస్టు చేసిన నిందితుడు కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు ప్రస్తుతం కర్మన్‌ఘాట్, హైదరాబాద్ లో నివాసం ఉంటున్నాడని స్వ గ్రామం ఏడిద గ్రామం, మండపేట మండలం, తూర్పు గోదావరి జిల్లా అని ఇతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 47 చోరీ కేసులు నమోదై ఉన్నాయని రాత్రి వేళల్లో ఇళ్లు, వ్యాపార సంస్థలు, షాపులను లక్ష్యంగా చేసుకుని షట్టర్లు లేదా తాళాలు పగులగొట్టి నగదు, విలువైన వస్తువులను అపహరించడం ఇతని నేర పద్ధతి అన్నారు.గతంలో పలుమార్లు అరెస్టై జైలు శిక్ష అనుభవించిన అనంతరం హైదరాబాద్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నప్పటికీ తన నేరప్రవర్తనను విడిచిపెట్టకుండా వరుస చోరీలకు పాల్పడుతున్నాడు.ఇటీవల తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసులో జైలుకు వెళ్లి విడుదలైన తర్వాత సత్తుపల్లి, మెదక్, సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు షట్టర్ లిఫ్టింగ్ చోరీలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని వివరించారు.ఈ కేసును నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో నల్లగొండ టు ఎస్ఐ డి. సైదబాబుతో పాటు పోలీసు సిబ్బంది లావూరి బాలకోటి, మహమ్మద్ షకీల్ సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసినందుకు జిల్లా ఎస్పి అభినందించారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపుకే క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్

**: రిజ్వాన**




జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పాఠశాల స్థాయి నుంచే పెంపొందించుకోవాలని నారాయణ విద్యాసంస్థల వరంగల్ జోన్ డీజీఎం రిజ్వాన్ అన్నారు. పట్ట ణంలోని నారాయణ స్కూల్‌లో బుధ వారం క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కా ర్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి స్వర్గం ప్రకాశం హా జరై మాట్లాడారు.తల్లిదండ్రుల ఆశయా లను నెరవేర్చాలంటే క్రమశిక్షణతో కూ డిన జీవన విధానాన్ని అలవర్చుకోవాల ని, జీవన నైపుణ్యాలను పెంపొందించు కోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అ ధిరోహించవచ్చని విద్యార్థులకు సూ చించారు. ఈ సందర్భంగా డీజీఎం రి జ్వాన మాట్లాడుతూ, విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవడం ద్వారా విద్యార్థులు సమాజాని కి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఫర్హానా రాజ్యాంగ స్ఫూర్తి, ఓటు హక్కు ప్రాధాన్యత పై వి ద్యార్థులకు అవగాహన కల్పించారు. అ నంతరం క్యాబినెట్ ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులకు బ్యాడ్జీలు ధ రింపజేసి అభినందించారు.విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్ విన్యాసాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలి చాయి. కార్యక్రమంలో హైస్కూల్ కోఆర్డి నేటర్ సాయికృష్ణ, అకాడమిక్ డీన్ విక్ర మ్, ఈచాన్స్ కోఆర్డినేటర్ శ్యామల,ఈ గిఫ్ట్ కోఆర్డినేటర్ శిరీష, ఏఓ బి.ఎన్. చారి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

*** ఉప్పల్ డిసిపి కె.సురేష్ కుమార్**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులు, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఉప్పల్ డిసిపి కె.సురేష్ కుమార్ అన్నారు. బుధవారం మేడిపల్లిలోని బీఎంఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్ లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాంకేతికత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు విద్యార్థుల భద్రతను మరింత మెరుగుపరుస్తుందని, క్రమ శిక్షణను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. మాదక ద్రవ్యాల వల్ల వ్యక్తి గత జీవితం, కుటుంబం , సమాజంపై కలిగే తీవ్రమైన దుష్పరిణామాలను వివరించి విద్యార్థులు అలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ బి.మోహన్కుమార్, సీఐ జలంధర్ రెడ్డి, డిఐ ఎన్.ఎలక్షన్ రెడ్డి, ఎస్ఐ జి.ఉదయ్ భాస్కర్, మేడిపల్లి పోలీస్ సిబ్బంది, మాజీ డిప్యూటి మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, పాఠశాల కరస్పాండెంట్ బి.జైపాల్ రెడ్డి, బి.రాఘవేందర్ రెడ్డి, బి.విజయేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శరణ్యకు పట్టు వస్త్రాలు బహుకరించి ఆశీర్వదించిన సమ్మిగౌడ్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేసముద్రం మండలం, అర్పణపల్లి గ్రామానికి చెందిన గంధసిరి యాదగిరి సుభద్ర దంపతుల కుమార్తె కుమారి గంధగిరి శరణ్య పలపుష్పాలంకరణ వేడుక స్వగృహంలో బంధుమిత్రులు,గ్రామ పెద్దలు,స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు సమ్మిగౌడ్ చిలువేరు ముఖ్య అతిథిగా హాజరై,శరణ్యకు అలాగే ఆమె కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు బహుకరించి "ఆడబిడ్డ ప్రతి కుటుంబానికి మహాలక్ష్మి స్వరూపిణి" విద్యతో పాటు మంచి సంస్కారం, విలువలతో ఎదిగి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని, సరస్వతి, లక్ష్మీదేవి అనుగ్రహంతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.మన తెలుగు సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే ఇటువంటి పరిపుష్పాలంకరణ, ఒడినింపుట వంటి ఆచారాలను భావితరాలకు అందించడం ప్రతి కుటుంబం బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకన్న గౌడ్, యాదగిరి, రిపోర్టర్ చింతనూరి రాజు,మోడెం రాజు, పలుస సునీతా వెంకన్న,తండ సంపత్ గౌడ్,షబ్బీర్,ఆకుల రాజు,బబ్బురి బుచ్చిరాములు, పలుస రాకేష్,రాజా నాయక్, వెంకటేశ్వర్లు,నాని మోడెం పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ కి ఘన సన్మానం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి :యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు 82 ఏండ్ల ఈశ్వరమ్మ యాదవ్ ని బుధవారం మేడ్చల్ జిల్లా ఒబిసి మోర్చా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈశ్వరమ్మ యాదవ్ పై తెలంగాణ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి జరిపిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట యాదవ సంఘం అధ్యక్షులు గండి రాజు యాదవ్ , మాజీ సమ్మయ్య యాదవ్ , కుమార్ యాదవ్ , కృష్ణ యాదవ్ , కురుమయ్య యాదవ్ , చరణ్ కృష్ణ యాదవ్ , రెడ్డి హైదరాబాద్ యాదవ్ తదితర యాదవ సోదరులు పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

# విద్యా ప్లస్‌తో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ఊతం

*** జిల్లా కలెక్టర్ హరిత**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న 'విద్యా ప్లస్' కార్యక్రమం విద్యార్థి కేంద్రిత, సాంకేతిక ఆధారిత బోధనకు కొత్త దిశగా నిలుస్తోందని కలెక్టర్ కె. హరిత తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తో కలిసి సందర్శించిన ఆమె విద్యా ప్లస్ యాప్ పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదిలో చివరి బెంచ్‌లో కూర్చున్న విద్యార్థికి కూడా పాఠం పూర్తిగా అర్థమయ్యేలా విద్యా ప్లస్ యాప్‌ను రూపొందించామని చెప్పారు. ఉపాధ్యాయులు ఐఎఫ్‌పీ డిజిటల్ స్క్రీన్ ద్వారా పాఠాలను బోధించగా, అనంతరం స్క్రీన్‌పై బహుళైచ్ఛిక ప్రశ్నలు ప్రదర్శించబడతాయని వివరించారు. విద్యార్థులు క్యూఆర్ కోడ్ బుక్ ద్వారా తమ సమాధానాలను చూపిస్తే, సీసీ కెమెరాలు వాటిని వెంటనే స్కాన్ చేసి ఫలితాలను నమోదు చేస్తాయని తెలిపారు.విద్యార్థులు నిర్దేశిత స్థాయిలో మార్కులు సాధించినప్పుడే తదుపరి అధ్యాయం అన్‌లాక్ అవుతుందని, మెజారిటీ విద్యార్థులు తక్కువ మార్కులు సాధిస్తే అదే పాఠాన్ని మళ్లీ బోధించాల్సి ఉంటుందని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులందరూ అభ్యాస లక్ష్యాన్ని చేరుకునే వరకు తదుపరి పాఠం ప్రారంభం కాదని పేర్కొన్నారు.ఈ విధానం వల్ల ఏ విద్యార్థి వెనుకబడకుండా ఉండటంతో పాటు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యం, ఉపాధ్యాయుల బోధన ప్రభావాన్ని సమర్థవంతంగా అంచనా వేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో విద్యా ప్లస్ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# గ్రామీణ విద్యార్థులకు ఐఓసీఎల్ సేవలు అమోఘం

*** ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి: జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఐఓసీఎల్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్‌తో పాటు పలు మౌలిక సదుపాయాలను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపి మాట్లడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అదేవిధంగా రూ.3.65 కోట్ల వ్యయంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో ఐస్పార్క్ ల్యాబ్‌లు, బంకర్ బెడ్స్, సోలార్ ఫెన్సింగ్, మెష్ డోర్లు, కిటికీలు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారు కోరుకున్న రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, నిర్మాణ్ సంస్థలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొంటూ, సంస్థల ప్రతినిధులను అభినందించారు. ఐఓసీఎల్ ప్రతినిధులు ఎలిమరన్, కైలాష్‌కాంత్ మాట్లాడుతూ ప్రభుత్వంతో కలిసి గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు అనురాధ, నీరజ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో తమ వంతు సహకారంకొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేష్ చిస్తీ, సెక్టోరియల్ అధికారులు సీహెచ్ రాధ, పెసరు లింగారెడ్డి, మండల విద్యాధికారి సీహెచ్ రంగరాజన్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యాలయాల్లో డైట్ మెనూ ఖచ్చితంగా పాటించాలి

*** కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి**



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని అన్ని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పనిచేయాలని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారుల ఆదేశించారు. బుధవారం సాయంత్రం హుస్నాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వంట గదిలో అన్నం, అల్చంతకాయ కూర, సాంబారు, పెరుగు, గోంగూర పచ్చడి లను పరిశీలించారు.స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేస్తూ చేసిన వంటలకు, ఇచ్చిన సరుకులు కూరగాయలను ఆరా తీశారు. రిజిస్టర్లో రాసిన వాటికి చేసిన కూర పరిమాణం కొలత వేసి తనికి చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం కొలత ప్రకారం సరుకులు తీసుకోవాలని, కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, చేసిన ప్రతి వంటకం నాణ్యతగా రుచికరంగా వండి విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరా తనిఖీ చేయగా సరిగ్గా పని చేయట్లేదని ఎట్టి పరిస్థితిలో సీసీ కెమెరాలు కేజీబీవీ ప్రాంగణ మొత్తం ఎల్లప్పుడు నిగా ఉంచేలా సీసీ కెమెరాలు పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థులతో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, మధ్యాహ్నం ఏం తిన్నారనీ ఆప్యాయంగా పలకరించారు. కోతుల బెడద ఉందని, అన్నం పప్పు సాంబార్ తో తిన్నామని విద్యార్థులు కలెక్టర్కు తెలిపారు. స్టోర్ రూమ్ లో వంటకు సరుకులు విద్యార్థుల సమక్షంలో కొలత వెయ్యాలని, చదువు భోజనం వసతి విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని ఎస్ఓ ను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఈలు, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలోని మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి మండలంలో పనులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని సూచించారు.అదేవిధంగా కొండమడుగు, జిబ్లాక్‌పల్లి, సిగన్నగూడెం ప్రాంతాల్లోని 2బీహెచ్‌కే కాలనీల భవనాలు, మౌలిక సదుపాయాల పనుల స్థితిగతులపై ఆరా తీశారు. కొండమడుగులోని 30 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేసి, పూర్తిగా అర్హులైన వారినే ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలాల్లో పూరి గుడిసెలు,డేరాలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పీడీ (హౌసింగ్), ఎంపీడీఓలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (హౌసింగ్), అసిస్టెంట్ ఇంజినీర్లు (హౌసింగ్), పంచాయతీరాజ్ శాఖ అధికారులు , మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించిన టౌన్ పోలీసులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లకు సంబంధించి నమోదైన ఫిర్యాదులపై సీఇఐఆర్ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా 11 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి యజమానులకు అప్పగించినట్లు మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపారు. పోగొట్టుకున్న లేదా చోరికి గురైన మొబైల్ ఫోన్లను బాధితులు వెంటనే సి ఇ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై గడ్డం ఉమ, ఏఎస్ఐ కరీముద్దీన్ మొబైల్ రికవరీ టెక్నికల్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ భవాని లు పాల్గొన్నారు.

# ఈ నెల 18న జరిగే యువ సంగ్రామ సదస్సుకు యువత సిద్ధం కావాలి

*** మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 18వ తేదీన సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు యువత సిద్ధం కావాలని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పిలుపునిచ్చారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రింగుబస్తీలో దాదాపు 200 మంది యువకులతో సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుకుల జగన్ మాట్లాడుతూ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పలు సూచనలు, దిశా నిర్దేశం చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కొలుకుల జైహింద్, బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, మల్లేష్ గౌడ్, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, మల్లారెడ్డి, పాపిరెడ్డి, పాపులు గౌడ్, ఆంజనేయులు, ప్రకాష్, మంజుల, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో దారుణం.. వేధిస్తున్నాడని యువకుడి దారుణ హత్య

హైదరాబాద్: చిన్నపల్లి భాస్కర్ (30) అనే యువకుడిపై దాడి చేసి దారుణంగా హత్య చేసిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ అదే గ్రామానికి చెందిన యువతిని గతంలో ప్రేమించాడు. అయితే కుటుంబసభ్యులు మూడేళ్ల క్రితం వేరే వ్యక్తితో ఆమెకు వివాహం జరిపించారు. పెళ్లయినప్పటి నుంచి యువతిని భాస్కర్ వేధిస్తున్నాడనే అనుమానంతో దారుణంగా కొట్టి చంపారు. హత్య చేసింది యువతి కుటుంబ సభ్యులేనని మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో మృతుడి బంధువులు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. యువతి తండ్రి రాజు, అతని బావమరిది పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు సమాచారం. మాదాపూర్ పోలీసులు యువతిని కూడా అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ భాస్కర్ కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వర్ధన్నపేట పోలీసులు ఉప్పరపల్లి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై నీటి కుంటల నిర్మాణంపై అవగాహన

* **మండల వ్యవసాయాధికారిణి ఆర్ వాణి**

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: రైతులు ప్రత్యామ్నాయ పంటలపై నీటి కుంటల నిర్మాణంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారిని రాముడు సూచించారు. కూసుమంచి మండలంలోని తురకగూడెం గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి రాముడుగు వాణి ఆధ్వర్యంలో బుధవారం రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, వ్యవసాయ నీటి కుంటల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాముడుగు వాణి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటితో



సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలయిన పెసర, కంది, జొన్న, ఆముదం వంటి పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు నష్టాలను నివారించవచ్చని వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం వల్ల దిగుబడులు మెరుగుపడటంతో పాటు రైతుల ఆదాయం కూడా స్థిరంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 100 శాతం రాయితీతో వ్యవసాయ నీటి కుంటలు (ఫార్మ్ పాండ్లు) నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటి కుంటలు 20మీటర్లు పొడవు 20మీటర్లు వెడల్పు 3 మీటర్లలోతు , 12 × 12 × 2.5 మీటర్లు మరియు 8 మీటర్లు పొడవు 8 మీటర్లు వెడల్పు 2.5 మీటర్ల లోతు పరిమాణాల్లో నిర్మించబడతాయని వివరించారు. వర్షాకాలంలో కురిసే వర్షపు నీటిని నిల్వ చేసి అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవడానికి ఈ నీటి కుంటలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే భూగర్భ జలాల మట్టం పెరగడం, పంటలకు రక్షణాత్మక నీటిపారుదల అందించడం, కరువు పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం పెరగడం, చేపల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాలకు కూడా ఈ కుంటలు దోహదపడతాయని రైతులకు వివరించారు. అర్హత కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ భూముల్లో నీటి కుంటలను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తురకగూడెం గ్రామ సర్పంచ్, వ్యవసాయ విస్తరణాధికారి జానీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్ బిల్లుపై నిర్ణయం తీసుకోలేదు

**: సుప్రియా సూలే**



డీలిమిటేషన్ బిల్లుపై తమ పార్టీ ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న ప్రచారం ''టీకప్పులో తుపాను'' లాంటిదేనని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమికి తాము మద్దతు ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను కొట్టిపారేశారు. ఓ జర్నలిస్టు, స్నేహితుడితో తన వాట్సప్‌లో జరిగిన వ్యక్తిగత సంభాషణను పార్టీ అధికారిక అభిప్రాయంగా ప్రచారం చేయడం సరికాదని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని.. వాటికి అన్యాయం జరగకూడదని పార్టీ భావిస్తోందని ఆమె తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచి, దానిని ఎలా అమలు చేస్తారో అధికారికంగా వెల్లడిస్తే, నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇచ్చే విషయాన్ని తమ పార్టీ పరిశీలిస్తుందని చెప్పారు. బిల్లును చూడకుండానే స్పందించడం సరికాదన్నారు.

# ఎలక్ట్రిక్ స్కూటర్‌లో మంటలతో భారీ అగ్నిప్రమాదం.. ఇద్దరి మృతి

నోయిడా: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎలక్ట్రిక్ స్కూటర్‌లో చెలరేగిన మంటలు బహుళ అంతస్తుల భవనానికి వ్యాపించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 100 మంది నివాసితులను ఖాళీ చేయించి మంటలను అదుపు చేశారు. పొగతో ఊపిరాడక ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురికాగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ సహా మరొకరు ప్రాణాలు కోల్పోయారని పోలీసులు తెలిపారు. నోయిడాలోని సెక్టార్ 66లోని మముర గ్రామంలో ఓ భవనంలో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఛార్జ్ చేస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగినట్లు నోయిడా సెంట్రల్ డీసీపీ వెల్లడించారు. ఈ మంటలు ఆ తర్వాత పెట్రోల్ వాహనాలకు అంటుకొని.. పై అంతస్తులకు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని తెలిపారు.



ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



# అస్సాం రైఫిల్స్ క్యాంప్‌పై మూక దాడి..

మణిపుర్‌లోని అస్సాం రైఫిల్స్ క్యాంప్‌పై మూకదాడి జరిగింది. సాయుధ బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన కొన్నిగంటల్లోనే క్యాంప్ (Assam Rifles Camp) వైపు దూసుకొచ్చిన కొందరు నిరసనకారులు రాళ్లు విసిరారు. వాహనాలకు నిప్పంటించి విధ్వంసానికి పాల్పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సేనాపతి పట్టణంలోని క్యాంప్‌పై ఈ దాడి జరిగిందని పోలీసులు వెల్లడించారు. వారిని చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. ఒక్లాంగ్ సమీపంలో కొందరు దుండగులు ఆయుధాలతో తిరుగుతున్నారనే సమాచారంతో అస్సాం రైఫిల్స్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. స్థానికులు అడ్డుకోగా.. వారికి సర్దిచెప్పి బలగాలు ఆపరేషన్‌ను కొనసాగించాయి. ఆ తర్వాత రాత్రి సమయంలో కొందరు నిరసనకారులు క్యాంప్ వద్దకు వచ్చి రాళ్లు విసిరి, ఆస్తుల ధ్వంసానికి పాల్పడ్డారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు వెల్లడించారు.

# సుప్రీంకోర్టులో అనుచిత ప్రవర్తన.. న్యాయశాస్త్ర విద్యార్థుల అరెస్టు

సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి (CJI)పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించిన ఇద్దరు న్యాయ విద్యార్థులను (Law Students) దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ప్రభల్ ప్రతాప్ సింగ్, చందర్ భాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. జులై 10న కోర్టులో ప్రభల్ ప్రతాప్ ప్రధాన న్యాయమూర్తిపై దుర్భాషలాడటమే కాకుండా కాగితాలు విసిరి గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. అడ్డుకునేందుకు ప్రయత్నించిన భద్రతా సిబ్బందిని తోసి విధులకు ఆటంకం కలిగించాడు. అతడితో పాటు ఉన్న రెండో నిందితుడు చందర్ భాన్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ విద్యార్థులిద్దరూ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారు. అయితే.. ఈ ఘటనపై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టబోమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. ''అతడు తీవ్ర మానసిక ఆవేదనలో



ఉన్నాడు. నిరాశతో అలా ప్రవర్తించాడు. అతడిపై మాకు సానుభూతి మాత్రమే ఉంది'' అని వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి (Chief Justice of India) జస్టిస్ సూర్యకాంత్ దీనిపై మాట్లాడుతూ.. ''ఈ ఘటనను పెద్దది చేయొద్దు. యువత కొన్ని సందర్భాల్లో ఇలా ప్రవర్తిస్తారు. రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడడం అందరి బాధ్యత'' అని పేర్కొన్నారు.

# హర్మూజ్‌ను దాటామని కుటుంబానికి చెప్పాడు.. అంతలోనే..

హర్మూజ్ జలసంధిలో ఒమన్ తీరం వద్ద వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై జరిగిన దాడిలో గల్లంతైన భారతీయుడు హేరంభ్ కర్మర్కర్ ప్రాణాలు కోల్పోయారు. చివరగా ఫోన్ చేసినప్పుడు హర్మూజ్ దాటినట్లు చెప్పాడని, చివరకు ఇలా జరిగిందని అతడి కుటుంబ సభ్యులు వాపోయారు. సైప్రస్ జెండాతో వెళ్తున్న ఈ నౌకపై ఆదివారం ఇరాన్ దాడి చేసింది. ప్రమాద సమయంలో నౌకలో 24 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో 11 మంది భారతీయులు. లైఫ్‌బోట్స్ సహాయంతో మిగిలిన వారు సురక్షితంగా బయటపడగా.. హేరంభ్ ఇంజిన్ రూమ్ వద్ద ఉన్నట్లు



తెలుస్తోంది. ఆ తర్వాత అతడు గల్లంతయ్యాడు. మెరైన్ ఇంజినీర్ అయిన హేరంభ్ స్వస్థలం మహారాష్ట్రలోని పుణె. దాడి జరగడానికి కొన్ని నిమిషాల ముందే అతడు కుటుంబంతో మాట్లాడాడు. తమ నౌక సురక్షితంగా హర్మూజ్ దాటిందని చెప్పాడని కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు. పశ్చిమాసియా ఘర్షణల కారణంగా మూడు నెలలుగా ఈ వాణిజ్య నౌక హర్మూజ్ సమీపంలో నిలిచిపోయింది. చాలా కాలం తర్వాత ఇంటికి వెళ్తున్నానన్న ఆనందంలో ఉన్న అతడు చివరకు అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు.

# అయోధ్య రామాలయ సీఈవో పదవికి 1,000 దరఖాస్తులు

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పదవికి ఇప్పటి వరకు 1,000కి పైగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. నోటిఫికేషన్ విడుదలైన 24 గంటల్లోనే భారీగా అప్లికేషన్లు వచ్చాయి. దరఖాస్తుదారులలో రాజకీయ నేపథ్యం ఉన్నవారు.. మాజీ ఉన్నతాధికారులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఉన్నట్లు తెలుస్తోంది. జులై 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని.. పరిశీలన ప్రక్రియ జులై 19 నుంచి ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 22న జరగనున్న ట్రస్ట్ సమావేశంలో సీఈవో నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాంట్రాక్టు పద్ధతిలో మూడేళ్ల



పదవీకాలానికి సీఈవోను నియమిస్తామని, పనితీరు ఆధారంగా తర్వాత పొడిగింపు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ట్రస్ట్ నిర్ణయాలను అమలు చేయడం, ఆర్థిక వ్యవహారాలు, కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం వంటి బాధ్యతలను కొత్త సీఈవో నిర్వర్తించాల్సి ఉంటుంది.

# స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాస్‌లు వాడొద్దు.. ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ సూచన



దిల్లీ: పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యే ఎంపీలు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు వంటివి ధరించొద్దని లోక్‌సభ సచివాలయం సూచించింది. దీనివల్ల భద్రతకు, వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ నెల 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న వేళ బులెటిన్ జారీ చేసింది. దేశంలో విరివిగా లభ్యవుతున్న స్మార్ట్‌వాచ్‌లు, పెన్ కెమెరా, స్మార్ట్‌గ్లాస్‌లు.. ఎంపీల హక్కులను ఉల్లంఘించే విధంగా ఉపయోగించే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు పార్లమెంట్ ఆవరణలో ఎంపీలు ధర్నాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు ప్రదర్శించడం, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడం వంటి వాటికీ దూరంగా ఉండాలని కోరింది. అలాగే, ఏఐతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు; అవమానకర రీతిలో రాసిన స్లోగన్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లనూ ప్రదర్శించొద్దని బులెటిన్‌లో పేర్కొంది. సమావేశాల సమయంలో తోటి ఎంపీలు తమ ఛాంబర్లకు వెళ్లడానికి వీలుగా పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించవద్దని సభ్యులకు విన్నవించింది. బడ్జెట్ సమావేశాల సమయంలో సస్పెన్షన్‌కు గురైన పలువురు ఎంపీలు పార్లమెంట్ గేట్ వద్ద ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రస్తావించింది.

# డిజిటల్ మూల్యాంకనంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన: సుప్రీంకోర్టు

సీబీఎస్ఈ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (OSM) విధానంపై విద్యార్థుల నుంచి పెరుగుతున్న ఫిర్యాదులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విధానంలో సంస్కరణలు చేపట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం (PIL)పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. డిజిటల్ మూల్యాంకన విధానంలో వ్యవస్థాగత లోపాలు కనిపిస్తున్నాయని ప్రధాన



న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. సమస్య పరిష్కారానికి సహకరించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరింది. ఈ విధానాన్ని సమీక్షించి సంస్కరణలు సూచించేందుకు ఎస్.రాధా చౌహాన్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు తుషార్ మెహతా వెల్లడించారు. ఈ కేసును వచ్చే వారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు, కమిటీ పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

# ఎఫ్‌బీఐ మోస్ట్ వాంటెడ్ జాబితాలో పంజాబ్ గ్యాంగ్‌స్టర్

పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ నితీశ్ కౌశల్‌ను ఎఫ్‌బీఐ మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. అమెరికాలో హత్యలు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాతో పాటు పలు హింసాత్మక దాడులకు పాల్పడుతున్న క్రమంలో ఈ చర్యలు తీసుకుంది. పంజాబ్‌కు చెందిన జగ్గు భగవాన్‌పురియా ముఠా నేతృత్వంలో నితీశ్ ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. 'యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఫర్ ది సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా' జూన్ 25న కౌశల్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ''ఆపరేషన్ హార్డ్ బాల్''లో భాగంగా భగవాన్‌పురియా ముఠాపై ఉక్కుపాదం మోపుతున్న క్రమంలో ఎఫ్‌బీఐ ఈ చర్యలు చేపట్టింది. ఈ ముఠా అమెరికా, కెనడా, యూరప్ దేశాల్లో దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే.

# పాకిస్థాన్ అకృత్యాలకు వ్యతిరేకంగా.. పీవోకేలో లాంగ్ మార్చ్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చడానికి విధించిన గడువు ముగియడంతో.. 'ది జమ్ముకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసింది. రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు వేలాది మంది నిరసనకారులు లాంగ్ మార్చ్ చేపట్టారు. పీవోకేలో పాక్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని.. ఆ నేతల అకృత్యాలకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పీవోకేలో ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు వీలుగా నిత్యావసర వస్తువులపై రాయితీలు, విద్యుత్ ఛార్జీల తగ్గింపు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు గుర్తింపు తదితర 38 డిమాండ్లు నెరవేర్చాలని జేఏఏసీ కోరుతోంది.

# జన నాయగన్ వస్తున్నడు..

ఎట్టకేలకు విజయ్ జన నాయగన్ రిలీజ్ కాబోతున్నది. ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాత సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ఈ ఏడాది జనవరిలో రిలీజ్ కావాల్సిన మూవీ సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ ప్రక్రియలో జాప్యంతో పలు సార్లు వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ఈ మూవీకి 'ఏ' సర్టిఫికెట్ లభించడంతో విడుదలకు మార్గం సుగమమైంది. సినిమా రన్ టైమ్ 3 గంటల 3 నిమిషాలు. తమిళనాడులో తొలి షో ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుండగా.. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ సహా పలుచోట్ల స్పెషల్ షోలు వేయనున్నారు. యూకేలో ఈ చిత్రాన్ని అన్‌కట్ వెర్షన్‌లో విడుదల చేయనున్నట్లు అక్కడి డిస్ట్రిబ్యూటర్స్ ప్రకటించారు. హెచ్. వినోత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. రాజకీయాల్లో పూర్తిస్థాయిలో కొనసాగనున్న విజయ్ నటుడిగా కనిపించే చివరి చిత్రం కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.




# పాపరాజీలపై మౌనీ రాయ్ ఆగ్రహం

బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ పాపరాజీల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. టీవీ హోస్ట్, నటి అనూషా దండేకర్‌తో కలిసి బయటకు వచ్చిన సమయంలో ఫొటోగ్రాఫర్లు ఆమెను నిరంతరం చిత్రీకరించడంతో ఆమె అసహనానికి గురైంది. వైరల్ అవుతున్న వీడియోలో మౌనీ కారు ఎక్కిన తర్వాత కూడా కెమెరాలు ఆపకపోవడంతో పలు మార్లు ఫొటోలు తీయొద్దని కోరింది. అయినా పాపరాజీలు కొనసాగించడంతో చివరకు స్టాప్! అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవలే భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్లు మౌనీ రాయ్ ప్రకటించింది. 2022 జనవరి 27న వివాహం చేసుకున్న ఈ జంట.. ప్రస్తుతం తమ జీవితాల్లో ప్రశాంతంగా ముందుకు సాగుతున్నామని, స్నేహం మాత్రం కొనసాగుతుందని వెల్లడించింది. కెరీర్ విషయానికి వస్తే.. మౌనీ ఇటీవల 'అబ్ హోగా హిసాబ్' వెబ్ సిరీస్‌లో నటించింది. ప్రస్తుతం మధుర్ భండార్కర్ తెరకెక్కిస్తున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తోంది. చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' లోనూ కనిపించనుంది.



# రజినీకాంత్ సినిమాలో రుక్మిణి?

వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు అందుకుంటున్న నటి రుక్మిణి వసంత్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కన్నడ స్టార్ యశ్ సరసన 'టాక్సిక్' సినిమాలో నటించిన ఆమె.. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' చిత్రంలో కనిపించనుంది. తాజాగా సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న 173వ చిత్రంలోనూ ఆమెకు అవకాశం దక్కినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కమల్ హాసన్ నిర్మాణంలో, అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఇప్పటికే సిమ్రాన్ హీరోయిన్‌గా ఎంపిక కాగా.. రాశి ఖన్నా కీలక పాత్రలో కనిపించనుంది. తాజాగా రుక్మిణి వసంత్ కూడా చిత్రబృందంలో చేరినట్లు సమాచారం. సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందు తున్న ఈ సినిమాపై ఫస్ట్ లుక్‌తోనే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. చేతిలో సర్జికల్ బ్లేడ్‌తో రజినీకాంత్ కనిపించిన పోస్టర్ అభిమానుల్లో ఆసక్తి పెంచింది. ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర ఏమిటన్నది ఇంకా స్పష్టత రాలేదు.





# వారణాసితో భిన్నమైన అనుభూతి

**- ప్రియాంక చోప్రా**

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రంపై భారీగా అంచనాలున్నాయి. మూవీలో కీలక పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా తాజాగా చిత్ర విశే షాలను పంచుకుంది. ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ప్రియాంక.. ఈ ప్రాజెక్ట్ కోసం గత 14 నెలలుగా ప్రత్యేకంగా పనిచేస్తున్నానని తెలిపింది. రాజమౌళి ప్రతి సన్నివేశాన్ని ఎంతో శ్రద్ధగా తెరకెక్కిస్తారని, ఈ సినిమా తన కెరీర్‌లో చేసిన ఇతర చిత్రాలకంటే పూర్తిగా భిన్నమైన అను భూతిని ఇస్తోందని చెప్పింది. ఈ చిత్రంలో 'మందాకిని' పాత్రలో కని పించనున్న ప్రియాంక.. సినిమాలో అద్భుతమైన స్లో మోషన్ సన్నివే శాల్లో నటించినట్లు వెల్లడించింది. కథ, పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను ఇప్పుడే చెప్పలేనని పేర్కొంది. షూటింగ్ విషయానికి వస్తే.. కీలక సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయినట్లు తెలుస్తోం ది. అక్టోబర్ నాటికి షూటింగ్ పూర్తి చేసి, వచ్చే ఏడాది ప్రారంభం నుంచి ప్రమోషన్ కార్యక్రమాలు మొదలుపెట్టాలని చిత్రబృందం భావిస్తోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# ప్రభాస్ పేరు వినగానే ఫుడ్ గుర్తుకొస్తుంది

**• పూజా హెగ్డే**

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌పై నటి పూజా హెగ్డే ప్రశంసలు కురిపించింది. సల్మాన్ ఎంతో మంచి మనసున్న వ్యక్తి అని, ఆయనకు కుట్రలు, కుతంత్రాలు తెలియవని పేర్కొంది. మనసులో ఏది ఉంటే అదే బయటకు చెప్పే నిజాయితీ ఆయన సొంతమని తెలిపింది. కొంతమంది సినీ ప్రముఖులు వ్యూహాలు, రాజకీయాలు నడిపిస్తుంటారని, కానీ సల్మాన్ మాత్రం అలాంటి వ్యక్తి కాదని పూజా వ్యాఖ్యానించింది. ఆయనతో కలిసి పనిచేయడం మంచి అనుభూతిని ఇచ్చిందని చెప్పింది. తనకు 'అరబిక్ కుతు', 'మోనికా' పాటలు ఎంతో ఇష్టమని తెలిపిన పూజా.. డాన్స్‌లో సంగీతాన్ని ఆస్వాదించడం హృతిక్ రోషన్ నుంచి నేర్చుకున్నానని చెప్పింది. ప్రభాస్ పేరు వినగానే తనకు ఫుడ్ గుర్తుకు వస్తుందని సరదాగా వ్యాఖ్యానించింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.